# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 243 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 24 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 243 24-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-





ఏపీని వణికిస్తున్న వాయుగుండం..




## పెట్రో కెమికల్ రంగంలో..
# ఏపీలో అపార అవకాశాలు

- దక్షిణాసియాకు చేరువలో వ్యూహాత్మక ప్రాంతంగా ఏపీ
- అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు
- ఏపీలో పెట్టుబడులు పెట్టాలని టెక్ కంపెనీలకు ఆహ్వానం
- రెండో రోజు పర్యటనలో అబుదాబి పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ

**అబుదాబి, అక్టోబర్ 23 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్... ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులకు ఏపీలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు. యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఏ స్క్వేర్‌లో ఏడీఎన్ఓసీ గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్‌జీ, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చించారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్,

- తరువాయి 2లో..





## ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో
# పెట్టుబడులు పెట్టండి

**రాష్ట్రంలో కోకో ఉత్పత్తి బాగుంది...**

**చాక్లెట్ పరిశ్రమ స్థాపించండి**

**అబుదాబీ పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీల్లో చంద్రబాబు**

**అబుదాబి, అక్టోబర్ 23:- (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

యూఏఈలోని రెండోరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అబుదాబిలోని వివిధ పారిశ్రామికవేత్తలతో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయనే అంశాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ వంటి రంగాల్లో

- తరువాయి 2లో..




# అమరావతి నిర్మాణానికి ఊపు..

- రెండో విడత నిధుల విడుదలకు ప్రపంచ బ్యాంకు గ్రీన్ సిగ్నల్
- ఈ ఏడాది చివరి నాటికి 200 మిలియన్ డాలర్లు విడుదలయ్యే అవకాశం
- తొలి విడత నిధుల్లో 50 శాతం ఇప్పటికే ఖర్చు చేసిన ప్రభుత్వం
- పనుల పురోగతిపై ప్రపంచ బ్యాంకు పూర్తి సంతృప్తి
- ఏడీబీ నుంచి కూడా 800 మిలియన్ డాలర్ల సాయం
- ప్రతి నెలా పనులను సమీక్షిస్తున్న ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందాలు




**అమరావతి అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులకు ప్రపంచ బ్యాంకు నుంచి మరో విడత భారీ నిధులు అందనున్నాయి. మొదటి దశ అభివృద్ధి కోసం హామీ ఇచ్చిన రుణంలో భాగంగా ఈ ఏడాది చివరి నాటికి రెండో విడతగా సుమారు 200 మిలియన్ డాలర్లను (దాదాపు రూ. 1700 కోట్లు) విడుదల చేసే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు గురువారం వెల్లడించారు. ఈ నిధుల విడుదలతో రాజధానిలో నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి. అమరావతి మొదటి దశ నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) చెరో 800 మిలియన్ డాలర్ల చొప్పున మొత్తం 1600 మిలియన్ డాలర్లు (రూ. 13,600 కోట్లు) ఆర్థిక సాయం అందించేందుకు అంగీకరించాయి. ఇందులో భాగంగా ప్రపంచ

- తరువాయి 2లో..

## వర్ష ప్రభావిత జిల్లాలకు..
# నిధుల విడుదల..

- నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ. 2 కోట్ల చొప్పున నిధులు
- మిగతా జిల్లాలకు కోటి రూపాయల చొప్పున కేటాయింపు
- తక్షణమే విడుదల చేయాలని అధికారులకు ఆదేశం
- అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగానికి ఆదేశాలు
- మంత్రులు, సీఎస్, కలెక్టర్లతో దుబాయ్ నుంచి సీఎం టెలీకాన్ఫరెన్స్




**దుబాయ్, అమరావతి అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షప్రభావిత జిల్లాలు నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య తదితర జిల్లాల పరిస్థితిపై మంత్రులు, సీఎస్, కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీవర్షాల కారణంగా తీవ్రంగా ప్రభావితం అయిన నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు

- తరువాయి 2లో..



# రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

**వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి**

**వ్యవస్థీకృతంగా నకిలీ మద్యం వ్యాపారం**

**ఉద్యోగుల విషయంలో చంద్రబాబు పిల్లిమొగ్గలు**

**రైతులకు విత్తనాలు దొరకడం లేదు**

**తాడేపల్లి అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కూటమి ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ టిడిపి నాయకులు పోలీసులు, ప్రభుత్వాధికారులను బెదిరించి పనులు చేయించుకుంటున్నారని అన్నారు. కూటమి పాలనలో ఎవరికీ ఏమీ చేయడం లేదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కాలేదని, సబ్సిడీ విత్తనాల ఊసులేదని, ఉల్లిధర పడిపోయిందని చెప్పారు. టిడిపి నాయకులు వ్యవస్థీకృతంగా నకిలీ మద్యం అమ్ముతున్నారని అన్నారు. ఫ్యాక్టరీల్లో తయారుచేసి వారి షాపుల్లోనే అమ్ముతున్నారని వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి వేలకోట్లు దోచుకుంటున్నారని వివరించారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం, పరవాడ, అమలాపురం, పాలకొల్లు, ఏలూరు, రేపల్లె, నెల్లూరులో నకిలీ మద్యం బయటపడిందని అన్నారు. దీనివెనుక టిడిపి నాయకులు జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు, జనార్ధనరావు ఉన్నారని అన్నారు. వారంతా గత ఎన్నికల్లో టిడిపికి ఇంటింటి ప్రచారం చేశారని

- తరువాయి 2లో..



# క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధనకు సహకారం

**మెల్‌బోర్న్ వర్శిటీ విసికి నారా లోకేష్ వినతి - ఆస్ట్రేలియా పర్యటనలో పలువురితో భేటీ**

**ఆస్ట్రేలియా, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధనకు, ఎఐ, తదితర అత్యాధునిక అంశాల అభివృద్ధికి సహకరించాలని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం వైఎస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మాజాన్సన్‌ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఐదో రోజు అయిన గురువారం నాడు ఆయన పలువురితో భేటీ అయ్యారు. మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఎమ్మాజాన్సన్‌తో సమావేశమయ్యారు. క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కు సహకరించాలని తెలిపారు. పంట దిగుబడులు, వాటర్‌మేనేజ్‌మెంట్, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను మెరుగుపరచడంపై ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయంతో కలిసి పరస్పర సహకారంతో పరిశోధనలు నిర్వహించాలని కోరారు. స్థానిక సంస్థలను భాగస్వాములుగా చేసి



- తరువాయి 2లో..



## మన్యంలో మదపుటేనుగుల దాడుల నిరోధంపై
# దృష్టి పెట్టండి..

- ఏనుగుల కదలికలపై నిరంతర నిఘా అవసరం
- ఒడిశా నుంచి వచ్చే ఏనుగులను తిరిగి మళ్లించే చర్యలు తీసుకోండి
- రాష్ట్ర సీతాకోక చిలుకగా తిరుమల మినియేసి బ్లూ టైగర్ గుర్తింపునకు ప్రతిపాదన
- జాతీయ వన్య ప్రాణి బోర్డు సమావేశానికి జాతీయ రహదారులకు అటవీ భూముల సేకరణ నివేదిక
- రాష్ట్ర వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్

**అమరావతి అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ప్రాంతానికి ఒడిశా వైపు నుంచి వస్తున్న మదపుటేనుగుల సమస్యను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణశాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులకు ఆదేశించారు. మన్యంలో ఏనుగుల సంచారం వల్ల జరుగుతున్న పంట నష్టం, ప్రాణ నష్టంపై నివేదిక ఇవ్వాలని సూచించారు.
మదపుటేనుగుల గుంపుల జాడను ఎప్పటికప్పుడు తెలుసుకుని పంటలకు నష్టం వాటిల్లకుండా వాటిని మళ్లించే ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారి అధ్యక్షతన రాష్ట్ర వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు తీసుకోవాల్సిన అటవీ అనుమతులు, ఉత్తరాంధ్ర ప్రాంతంలో మనుషులు, జంతువుల మధ్య జరుగుతున్న సంఘర్షణలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.
ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దుల్లో మదపుటేనుగుల సంచారం వల్ల

- తరువాయి 2లో..





## కాంగ్రెస్ ఒక రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చింది..
# చిత్తుగా ఓడించండి: కేసీఆర్

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు ఈ ఎన్నిక ఒక పరీక్ష అని వ్యాఖ్య**

**ఈ ఫలితం జీహెచ్‌ఎంసీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని జోస్యం**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న తరుణంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చిందని తీవ్రంగా ఆరోపించిన ఆయన, విజ్ఞులైన జూబ్లీహిల్స్ ప్రజలు అతడిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నిక హైదరాబాద్ నగర ప్రజల తెలివితేటలకు, విజ్ఞతకు ఒక కఠిన పరీక్షగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సన్నాహక సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం గుల్లగా మారింది. శాంతిభద్రతలకు మారుపేరైన హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి. మా పదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నీ కాంగ్రెస్ వచ్చాక కనుమరుగయ్యాయి" అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ దుష్టపాలన గురించి ప్రజలకు మరింతగా వివరించాలని

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## తీవ్ర ఆందోళనకరం

దేశ రాజధాని నగరం ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) బుధవారం ఉదయం విడుదల చేసిన నివేదిక ప్రకారం కాలుష్య కారక సూక్ష్మ కణాల స్థాయి (పిఎం 2.5) గడిచిన ఐదేళ్ల కాలంలోనే అత్యధికంగా నమోదైంది. దీపావళి తరువాత 24 గంటల్లో సగటు పిఎం2.5 సాంద్రత ఒక క్యూబిక్ మీటర్‌కు 488 మైక్రో గ్రాములకు చేరింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) నిర్దేశించిన భద్రతా పరిమితికి దాదాపు 60 రెట్లు అధికం కావడం గమనార్హం. దీంతో ఢిల్లీ నగరమంతా ఒక రకమైన భయానక వాతావరణం నెలకొంది. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడగా అత్యవసరమైన పనులుంటేనే ఇళ్ల నుండి బయటకు రావాలని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించడంతో పరిస్థితి తీవ్రత బోధ పడుతుంది. అనివార్య పరిస్థితుల్లో జాతీయ రాజధాని పరిధి (ఎన్‌సిఆర్) లోని ఢిల్లీ నగరమంతా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి-2) నిబంధనలను అమలులోకి తీసుకువచ్చి సెంట్రల్ ఎయిర్ క్వాలిటి మేనేజ్‌మెంట్ (సిఎక్యుఎం) రంగంలోకి దింపాల్సి వచ్చింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీ ప్రజానీకం శ్వాసకోస సమస్యలతో ఆసుపత్రుల ముందు బారులు తీరుతున్నారు. వీరిలో వృద్ధులు, పసిపిల్లలు ఎక్కువగా ఉన్నారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. సిపిసిబి తాజాగా చేసిన విశ్లేషణ ప్రకారం దీపావళి తరువాత సగటు పిఎం2.5 స్థాయి ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. అయితే, గత ఐదేళ్ళ కాలంలో ఈ స్థాయిలో పెరుగుదల లేదు. 2021లో 454.5, 2022లో 168, 2023లో 319.7, 2024లో 220 మైక్రోగ్రాములుగా మాత్రమే నమోదైంది.

నిజానికి, దీపావళికి ముందే ఈ ఏడాది దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రంగా నమోదైంది. అయినా, అత్యున్నత న్యాయస్థానం ముందు జరిగిన విచారణలో ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం కూడా ఢిల్లీలో టపాసుల అమ్మకాల మీద నిషేధాన్ని ఎత్తివేయించేందుకు శక్తివంచన లేకుండా పాటుపడ్డాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పండగపూట టపాసులు కాల్చనీయకుండా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందంటూ ఆరోపించిన బిజెపి నేతలు, అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే విధంగా వ్యవహరించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కూడా దీపావళిని దీపాలతో సరిపెడితే ఎలా అని బాహాటంగానే ప్రశ్నించారు. కేంద్రంతో పాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ వైఖరితో గ్రీన్‌క్రాకర్స్ అమ్మకాలకు సుప్రీంకోర్టు అనుమతిచ్చింది. గత ఏడాది ఆప్ ప్రభుత్వం దీపావళికి కొద్దిరోజుల ముందు అన్ని రకాల బాణాసంచా విక్రయాలపై నిషేధం విధించినా, ఆ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగిదంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ మతమూ వాతావరణాన్ని కలుషితం చేయమని చెప్పదని, ప్రాథమిక హక్కుయైన ఆరోగ్యాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వాలు కాపాడి తీరాలని అప్పట్లో స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం తాజాగా దానినుండి వైదొలగడం గమనార్హం.

సుప్రీంకోర్టు గ్రీన్ క్రాకర్స్‌కే అనుమతి ఇచ్చినప్పటికీ ఆ పేరుతో అన్ని రకాల బాణాసంచా ఢిల్లీ నగరంలోకి ప్రవేశించింది. కొన్ని పరిమిత గంటల్లోనే బాణాసంచా కాల్చడానికి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన అనుమతి సైతం ఆచరణలో అమలు కాలేదు. ఇప్పుడు పరిస్థితులు చేయి దాటే ప్రమాదం కనపడుతుండటంతో సాక్షాత్తు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో పాటు ప్రభుత్వంలోని మరికొందరు పంజాబ్ రైతులను గడ్డి తగలపెట్టేలా ఆప్ నేతలు ఒత్తిడి చేశారని, దాని ఫలితంగానే ఢిల్లీలో ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించడం దుర్మార్గం. ప్రజలను చీల్చి లబ్ధి పొందే ఎత్తుగడలు కాషాయదళానికి కొత్త కాకపోయినప్పటికీ, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశాలను కూడా ఇలా వాడుకోవడం దారుణం. ఢిల్లీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా శాశ్వత ప్రాతిపదికన సమగ్ర చర్యలు చేపట్టాలి, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. లేని పక్షంలో దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య రాజధానిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# అమరావతిలో విపత్తు నిర్వహణ ప్రణాళిక

## కన్సల్టెంట్లను ఆహ్వానించిన సిఆర్‌డిఏ

**అమరావతి అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర రాజధాని అమరావతిలో విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీనిలో భాగంగా ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది. ప్రపంచబ్యాంకు నిధులిస్తున్న నేపథ్యంలో అమరావతి రాజధానిలో విపత్తు నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని నిబంధనల్లో పేర్కొంది. దీనిలో భాగంగా రాబోయే 30 సంవత్సరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన నివేదికను తయారు చేయాల్సి ఉంటుంది. అమరావతి రాజధానిలో కొండవీటివాగు, కృష్ణానది, భారీ వర్షాలు, తుఫానుల నుండి తీసుకోవాల్సిన రక్షణ చర్యలను కన్సల్టెన్సీ సంస్థ రూపొందించాలి ఉంటుంది. అలాగే భూకంపజోన్-3లో ఉండటంతో దానికి అనుగుణంగా భవనాల నిర్మాణంపైనా ప్రత్యేక నివేదికను రూపొందించాలి. అమరావతిలో నిర్మించే భవనాలు భూకంపాలను, ఇతర ప్రకృతి విపత్తులను తట్టుకునేలా ఉండాలని 2017 నవంబరు 17వ తేదీన ఎన్‌జిటి ఇచ్చిన ఆదేశాల ప్రకారమూ విపత్తు నిర్వహణ ప్లాను తప్పనిసరిగా రూపొందించాల్సి ఉంది. ప్రణాళికలో భాగంగా ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులకు సంబంధించిన నివేదికను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ నివేదికలో వరదలు, అగ్ని ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాల్సి ఉంటుంది. అలాగే ముంపు ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలు, సంస్థల జాబితానూ ఎప్పటికప్పుడు రూపొందించాల్సి ఉంటుంది. అమరావతిలో కొత్తగా కన్సల్టెన్సీని నియమించాలనే నిర్ణయం చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి విపత్తుల ప్లాను ఉందని, వరదల ముంపు నివారణ కోసం ఉండవల్లి వల్ల లిఫ్టు ఏర్పాటు చేశారని, మరలా కొత్తగా కన్సల్టెన్సీ చేయాల్సిందేమిటనే దానిపై రైతుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## పెట్రో కెమికల్ రంగంలో.. ఏపీలో అపార అవకాశాలు

ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సీఎం అన్నారు. ఏడీఎన్ఓసీ%-%ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకేతిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు.

**అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌తోనూ భేటీ**

అబుదాబీ చాంబర్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తున్నాయని సీఎం తెలిపారు. కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందన్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సీఎం ఆహ్వానించారు. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ 42 ఇంటర్నేషనల్ సంస్థను ఏఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు స్వాగతించారు.

**టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్వర్క్ లంచ్**

అనంతరం అబుదాబీలోని పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం నెట్వర్క్ లంచ్ సమావేశంలో పాల్గొంది. దీనిలో జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్స్యూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్, ఇన్నార్ట్స్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్స్పెషన్ సీఈవో ఆశీష్ కోషి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వారికి వివరించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మెషిన్ లెర్నింగ్, ఫిన్ టెక్, హెల్త్ టెక్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సూచించారు. త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. యూఏఈలో టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏపీలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్‌తో పాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

ఎట్టుబడులు పెట్టాలని కోరారు. అపెక్స్ ఇన్వెస్ట్మెంట్స్, మస్దార్, అగ్తియా గ్రూప్, లులు గ్రూప్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు విడివిడిగా భేటీ అయ్యారు. ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని అపెక్స్ ఇన్వెస్టిమెంట్ ఛైర్మన్ ఖలీఫా ఖౌరీ, మస్దార్ సీఈఓ మొహమ్మద్ జమీల్ అల్ రమాహీని ముఖ్యమంత్రి కోరారు. విశాఖలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని అపెక్స్, మస్దార్ సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. ఈ క్రమంలో బ్యాటరీ స్టోరేజ్ రంగంలో పెట్టుబడులపై అపెక్స్ ప్రతినిధులు చర్చించారు. సూపర్ కెపాసిటర్స్ రంగంలో పేరొందిన అపెక్స్ సంస్థను ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం ఆహ్వానించారు. ఈ మేరకు సూపర్ కెపాసిటర్ ఉత్పత్తులను రాష్ట్రానికి పంపాలని అపెక్స్ ప్రతినిధులను సీఎం కోరిన మీదట...సూపర్ కెపాసిటర్ ప్రొడెక్టును పంపేందుకు అపెక్స్ ప్రతినిధులు అంగీకరించారు. ఇక ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు పెట్టాలని ఎపెక్స్ సంస్థను సీఎం ఆహ్వానించారు. సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని మస్దార్ సీఈఓను చంద్రబాబు ఆహ్వానించారు. ఇక అగ్తియా గ్రూప్ సీఈఓతో సల్మీన్ అలమేరీ, లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీతో జరిపిన వేర్వేరు భేటీల్లో ఫుడ్ ప్రాసెస్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆ రెండు సంస్థలను సీఎం ఆహ్వానించారు. ఏపీలో కోకో ఉత్పత్తి బాగుంటుందని... తమ దగ్గర చాక్లెట్ పరిశ్రమ పెట్టే అంశంపై ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి అగ్తియా గ్రూప్ కు సూచించారు. అలాగే గల్ఫ్ దేశాల నుంచి పారిశ్రామిక వేత్తలను తీసుకుని విశాఖ పెట్టుబడుల సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానించారు.

## అమరావతి నిర్మాణానికి ఊపు..

బ్యాంకు ఇప్పటికే ఈ ఏడాది మార్చిలో తొలి విడతగా 207 మిలియన్ డాలర్లను విడుదల చేసింది. ఈ నిధులలో దాదాపు 50 శాతం మేర వివిధ పనులకు ఖర్చు చేసినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ తెలిపారు. "ప్రపంచ బ్యాంకు నుంచి మాకు దాదాపు రూ. 1800 కోట్లు అందాయి. అందులో సగానికిపైగా ఖర్చు చేశాం. నిబంధనల ప్రకారం తొలి విడత నిధుల్లో 75 శాతం ఖర్చు పూర్తి కాగానే, రెండో విడత కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ నాటికి ఆ లక్ష్యాన్ని చేరుకుని, తదుపరి విడత నిధులను పొందుతామని ఆశిస్తున్నాం" అని ఆయన పీటీఐకి వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా తన వాటాగా రూ. 1400 కోట్లను అందించనుంది. రాజధానిలో జరుగుతున్న పనుల పురోగతిని ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందాలు ప్రతి నెలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాయని సురేశ్ కుమార్ పేర్కొన్నారు. సీఆర్డీఏ అధికారులతో సమావేశమై, రికార్డులను పరిశీలించి, పనుల నాణ్యతను తనిఖీ చేస్తున్నాయని తెలిపారు. పనుల అమలు తీరుపై ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో పూర్తి సంతృప్తి వ్యక్తం చేసిందని ఆయన గుర్తు చేశారు. నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభం కావడం, పర్యావరణ-సామాజిక నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలను ప్రపంచ బ్యాంకు ప్రశంసించినట్లు నివేదికలో పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ రుణగ్రహీతగా వ్యవహరిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) అమలు ఏజెన్సీగా బాధ్యతలు నిర్వర్తిస్తోంది.

## వర్ష ప్రభావిత జిల్లాలకు.. నిధుల విడుదల

ఎస్డీఆర్ బృందాలను, నెల్లూరు జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తక్షణం మోహరించాలని ముఖ్యమంత్రి సూచనలిచ్చారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, రహదారులు, భవనాలు, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలనీ ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలతో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, పిల్లలకు పాలు లాంటి ఆహారపదార్థాలను అందుబాటులో ఉంచాలన్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. తీవ్ర వర్షాల కారణంగా కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని సీఎం అధికారులకు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పంట నష్టం జరక్కుండా చూడాలని సీఎం సూచనలిచ్చారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాలతో చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు.

## రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

పేర్కొన్నారు. వారిని వైసిపి నాయకుల అనుచరులంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రికి ధైర్యముంటే నకిలీ మద్యం దొరికిన తరువాత ఎన్నిషాపుల్లో తనిఖీలు చేయించారో చెప్పాలని ప్రశ్నించారు. జనార్ధనరావు విదేశాల నుండి వస్తున్నారని తెలిసినా అరెస్టు చేయకుండా, కస్టడీలో ఉన్న అతనితో వీడియోలో మాట్లాడించి బయటపెట్టారని తెలిపారు. కేసును సిబిఐకి అప్పగిస్తే అన్ని వాస్తవాలూ తెలుస్తాయని, ఆపనిచేయకుండా సిట్ అంటూ కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. కేసుతో సంబంధం లేని జోగి రమేష్‌ను ఇందులో ఇరికించారని అన్నారు.

**వైసిపి హయాంలోనే డేటా సెంటర్‌కు బీజం**

2020 నవంబరులో విశాఖలో ఆదానీ డేటా సెంటర్‌కు బీజం పడగా 2023 మే3న శంకుస్థాపన చేశామని తెలిపారు. సబ్‌సీ కేబుల్‌ను సింగపూర్ నుండి తీసుకొచ్చే పనికూడా చేపట్టామని వివరించారు. అప్పట్లోనే డేటా సెంటర్‌కు బీజం పడిందని, ఆ ప్రాజెక్టు విస్తరణలో భాగంగానే ప్రస్తుత గూగుల్ డేటా సెంటర్ అని చెప్పారు. అదానీ గ్రూప్, కేంద్ర ప్రభుత్వం, వైసిపి ప్రభుత్వం చూపిన చొరవ వల్ల ఇది సాధ్యమైందని అన్నారు. అదానీ కంపెనీ అంటే చంద్రబాబుకు పేరురాదేమోననే ఉద్దేశంతో గూగుల్ డేటా సెంటరని చెబుతున్నారని విమర్శించారు. డేటా సెంటర్ వల్ల ఉపాధి పెద్దగా లేకపోయినా ఎఐ కాలంలో దాని అవసరం ఉందని, అందువల్ల దానిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఎవరు ఏ పనిచేసినా తన క్రెడిట్లో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, హైటెక్ సిటీ నిర్మాణమే దానికి ఉదాహరణని అన్నారు. 2004లో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రూ.5660 కోట్లు ఉంటే 2014 నాటికి రూ.57 వేలకోట్లకు పెరిగిందని అదికూడా చంద్రబాబు క్రెడిట్లో వేసుకుంటున్నాడని విమర్శించారు. ఇప్పుడు తెలంగాణాలో ఐటి ఎగుమతులు రూ.2 లక్షల కోట్లని తెలిపారు. విశాఖ అభివృద్ధి చెందుతుందని ఆలోచన చేసింది వైసిపి ప్రభుత్వమని అన్నారు. ఆ ప్రాంతంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. ఉద్యోగులకు నాలుగు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించలేదని విమర్శించారు. పోలీసులకు ఒక్క ఇఎల్ ఇచ్చి అది కూడా ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంట్లంటున్నారని అన్నారు. ఉద్యోగుల కోసం తెచ్చిన జిపిఎస్‌ను అమలుచేయడం లేదని అన్నారు. ప్రతినెలా 1వతేదీన జీతాలు రావడం లేదని పేర్కొన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని చెప్పి తరువాత మోసం చేశారని తెలిపారు. 2.66 లక్షలమందిని రోడ్డుపాల్జేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వచ్చాడు**

బాలకృష్ణ మద్యం తాగి అసెంబ్లీకి వచ్చి తనకు సంబంధం లేదని అంశంలో జోక్యం చేసుకుని ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, అసలు మద్యంలో ఆయనకు మాట్లాడేందుకు ఎందుకు అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. దాన్ని స్పీకర్ చూస్తూ ఊరుకున్నారని తెలిపారు. బాలికపై టిడిపికి చెందిన ఓ ఎస్‌సి నాయకుడు అత్యాచారం జరిపాడని అన్నారు.

**మొలకలచెరువు నుంచి కాస్త ముందుకు వస్తే..**

విజయవాడలో, ఎక్కడైతే సీపీ పర్యవేక్షణలో పోలీసులు పనిచేస్తున్నారో.. ఏ పోలీస్ కమిషనర్ అయితే చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నాడో.. ఏ పోలీస్ కమిషనర్ అయితే సిట్ పేరుతో గతంలో ఏమీ జరగకపోయినా కూడా తప్పుడు సాక్ష్యాలతో మా పార్టీ వారిని వేధించే కార్యక్రమాలు చేస్తున్నాడో.. అదే విజయవాడ సీపీ పర్యవేక్షణలో ఉన్న ఇబ్రహీంపట్నంలో మరో నకిలీ మద్యం ఫ్యాక్టరీ బయటపడింది. ఇబ్రహీంపట్నంలో దొరికిన నకిలీ మద్యం దాదాపుగా 27,224 బాటిళ్లు. రాష్ట్రంలో ఇక మిగిలిన చోట్ల అనకాపల్లి జిల్లా పరవాడలో నకిలీ మద్యం ఫ్యాక్టరీ బయటపడింది. అమలాపురంలో ఇలాగే మద్యం ఫ్యాక్టరీ బయటపడింది.. పాలకొల్లులో ఇలాగే మద్యం ఫ్యాక్టరీలు బయటపడ్డాయి.. ఏలూరులో ఇదే మాదిరిగానే మద్యం ఫ్యాక్టరీలు బయటపడ్డాయి.. రేపల్లెలో ఇదే మాదిరిగా మద్యం ఫ్యాక్టరీ బయటపడ్డాయి.. నెల్లూరులో ఇదే మాదిరిగా నకిలీ మద్యం ఫ్యాక్టరీ బయటపడ్డ పరిస్థితులు మధ్య.. ఈ నకిలీ మద్యం తయారీని మొత్తం కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రంలో కొన్ని లక్షల బాటిళ్లు తయారు చేసేదీ వీళ్లే.. డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ ద్వారా వీళ్లకు సంబంధించిన ప్రైవేట్ మాఫియా షాపుల్లోకి, వీళ్లకు సంబంధించిన బెల్ట్ షాపులకు, వీళ్లకు సంబంధించిన ఇల్లీగల్ పర్మిట్ రూమ్ లకు అన్నింటికీ వీళ్లే డిస్ట్రిబ్యూట్ చేసి అమ్ముతున్నారు.

## క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధనకు సహకారం

డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్, టెలీ మెడిసిన్ ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపర్చేందుకు సహకారం అందించాలని తెలిపారు. స్మార్ట్ సిటీ ప్లానింగ్, వ్యర్థ నిర్వహణ, పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో నైపుణ్యాలను పంచి ఎపి పట్టణ అభివృద్ధి లక్ష్యాల సాధనకు మద్దతుగా నిలవాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఎపిలో ఫార్మసీ, పారా మెడికల్ కోర్సుల్లో పాఠ్యప్రణాళిక అభివృద్ధికి సహకారం అందించాలని యూనివర్సిటీ ఆఫ్ టాస్మానియా డిప్యూటీ వైస్ ఛాన్సలర్ నటాలీ బ్రౌన్‌ను కలిసి మంత్రి కోరారు.ఆయా కోర్సులకు సంబంధించిన శిక్షణలో డిజిటల్ హెల్త్ టూల్స్ అనుసంధానించాలని తెలిపారు. వైద్య కళాశాలలు, స్కిల్ యూనివర్సిటీకి టాస్మానియా వర్సిటీ ఫార్మా, హెల్త్ కే నెట్‌వర్క్‌ను అందించి పరిశ్రమ భాగస్వామ్యాలకు సహకరించాలని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా అర్హతలకు అనుగుణంగా ఎపి ఫార్మసీ విద్యార్థుల స్కిల్ సర్టిఫికేషన్స్‌ను బెంచ్ మార్కు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలి**

విశాఖపట్నంలో బుపా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జిసిసి) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని బ్రిటీష్ మల్టీనేషనల్ హెల్త్ కేర్ అండ్ ఇన్సూరెన్స్ సంస్థ బుపా ఆసియా పసిఫిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజల్ సెజ్ పాల్, ఎంటర్ ప్రైజ్ ఇంటిలిజెన్స్ హెడ్ దినేష్ కంతేటిని లోకేష్ కోరారు. గ్రామీణ డిజిటల్ ఆరోగ్య సేవల కోసం రాష్ట్రప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సూచించారు. ఎపి పర్యాటకశాఖతో కలిసి హెరిటేజ్ టూరిజం, మార్కెటింగ్, ఎకో సర్టిఫికేషన్‌పై కలిసి పనిచేయాలని విక్టోరియా రాష్ట్ర పర్యావరణ, టూరిజం, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌ను మరో భేటీలో లోకేష్ కోరారు. గ్రేట్ ఓషన్ రోడ్ తరహా పర్యావరణ బ్రాండింగ్‌కు విక్టోరియా నైపుణ్యాన్ని ఎపికి అందించాలని విజ్ఞప్తి చేశారు.

## మన్యంలో మదపుటేనుగుల దాడుల నిరోధంపై దృష్టి పెట్టండి..

రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒడిశా వైపు రాష్ట్రంలో ప్రవేశించిన రెండు గుంపులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని క్షేత్ర స్థాయి నుంచి తెలిసింది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలి. ట్రాకర్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా వాటిని తిరిగి అడవిలోకి మళ్లించాలి. ఒడిశా వైపు నుంచి వస్తున్నాయి కాబట్టి అవసరం అయితే ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వాటిని వెనక్కి పంపే విధంగా చర్యలు తీసుకోవాలి.

**అటవీ భూముల సేకరణపై జాతీయ వన్యప్రాణి బోర్డుకు నివేదిక**

రాష్ట్ర పరిధిలో పలు జాతీయ రహదారుల నిర్మాణానికి అటవీ భూములు అవసరం అవుతాయి. అటవీ భూములతో పాటు ఎకో సెన్సిటివ్ జోన్, టైగర్ రిజర్వ్ జోన్ పరిధిలో ఉన్న భూములను దీని నిమిత్తం సేకరించాల్సి ఉంది. బద్వేల్, నెల్లూరు మధ్య 67వ నంబర్ నాలుగు లైన్ల జాతీయ రహదారి నిమిత్తం 34.67 హెక్టార్ల అటవీ భూమి అవసరం ఉంటుందని అధికారులు తెలియజేశారు. ఈ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్ లో ఉంది. ఈ భూములను బదిలీ చేసేందుకు జాతీయ వన్య ప్రాణి బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి కోసం పంపించనున్నాం. బెంగళూరు, కడప, విజయవాడ ఎక్స్ ప్రెస్ కారిడార్ కోసం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ తో పాటు శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ నుంచి 40.86 హెక్టార్లు భూమి బదిలీ చేసేందుకు నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇండియా అనుమతులతో పాటు జాతీయ వన్య ప్రాణి బోర్డుకు నివేదిక అందజేయనున్నాం. ఈ నెల 29వ తేదీన గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి అధ్యక్షతన జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశానికి పై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో కనిపించే అరుదైన సీతాకోక చిలుక అయిన తిరుమల లిమినియేసి బ్లూ టైగర్ సీతాకోక చిలుకను... రాష్ట్ర సీతాకోక చిలుకగా గుర్తించాలని జాతీయ వన్య ప్రాణి బోర్డు ప్రతిపాదన పంపుతున్నామ"న్నారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. మల్లికార్జున నాయక్, పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ డాక్టర్ పి.వి. చలపతిరావు, మత్స్య శాఖ కమిషనర్ శ్రీ రామ శంకర్ నాయక్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, అడిషనల్ డి.జి. శ్రీ ఎన్. మధుసూదన్ రెడ్డి, ప్రముఖ శాస్త్రవేత్తలు శ్రీమతి దీపా జైస్వాల్, శ్రీ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఒక రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చింది..

## చిత్తుగా ఓడించండి: కేసీఆర్

ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ ఉప ఎన్నిక ఫలితం రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కేసీఆర్ జోస్యం చెప్పారు. "జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తే, ఆ గెలుపు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగుతుంది. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారనే సంకేతాలు వెళతాయి. ఈ ఉప ఎన్నికలో మన విజయం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

# ఏపీని వణికిస్తున్న వాయుగుండం..

## 6 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

- బ్రంగాళాఖాతంలో అల్పపీడనం.. వాయుగుండంగా మారే అవకాశం
- ప్రక్రాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలకు రెడ్ అలర్ట్
- ద్రక్షిణ కోస్తా, రాయలసీమలో అతి భారీ వర్షాల సూచన
- అ్రధికారులను అప్రమత్తం చేసిన ప్రభుత్వం.. సహాయక బృందాలు సిద్ధం
- శ్రనివారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక
- శ్రీకాళహస్తిలో రికార్డు స్థాయిలో 19 సెం.మీ. వర్షపాతం నమోదు

అమరావతి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**నైరుతి బంగాళాఖాతంలో సుస్పష్ట అల్పపీడనం కొనసాగుతోంది. 12 గంటల్లో క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశముంది. అండమాన్ సముద్ర తీరంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. 24 గంటల్లో రాష్ట్రంలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాలతో పాటు యానాంలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందని పేర్కొంది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.**



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇది మరింత బలపడి గురువారం మధ్యాహ్నానికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వాయుగుండం పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు రానుండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు తప్పవని అధికారులు అంచనా వేస్తున్నారు. వాయుగుండం ముప్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వాతావరణ శాఖ ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, పల్నాడు జిల్లాకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయానికి శ్రీకాళహస్తిలో అత్యధికంగా 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, అందువల్ల మత్స్యకారులు శనివారం వరకు వేటకు వెళ్లవద్దని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిస్థితులపై హోంమంత్రి వంగలపూడి అనిత, విపత్తుల శాఖ స్పెషల్ సీఎస్ జి. జయలక్ష్మి ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి జిల్లాలకు ఒక ఎన్డీఆర్ఎఫ్, నాలుగు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రతి జిల్లాలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని సూచించారు.

### మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ

కృష్ణపట్నం పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లింగసముద్రంలో 8.3 సెం.మీ, ఉలవపాడులో 6.2 సెం.మీ, రాపూరులో 5.6 సెం.మీ, మర్రిపాడులో 5.3 సెం.మీ, ఉదయగిరిలో 4.7 సెం.మీ, అనంతసాగరం, కొండాపురంలో 4.6 సెం.మీ, కోవూరులో 4.1 సెం.మీ, కొడవలూరులో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి పెన్నా నదిలో వరద ప్రవాహం పెరిగింది.

### వాగు ఉద్ధృతితో రాకపోకలకు అంతరాయం

నెల్లూరు జిల్లా చేజెర్ల మండలం యనమదల వద్ద నల్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మర్రిపాడు మండలం బొగ్గేరు, సైదాపురం మండలం పిన్నేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పొదలకూరు మండలంలో నావూరు, పెదవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. గుడ్లూరు–తెట్టు మధ్య రాళ్ల వాగు ఉద్ధృతితో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా వర్షాలు

- మచిలీపట్నంలో ఉదయం నుంచి కుండపోత వర్షం
- వర్షం కారణంగా కాల్వలను తలపిస్తున్న ప్రధాన రహదారులు
- నీటమునిగిన బస్టాండ్ ప్రాంతం, కోర్టు సెంటర్, కలెక్టర్‌లోని కార్యాలయాలు
- రహదారులపై వర్షపు నీటి ప్రవాహంతో వాహనాదారుల ఇబ్బందులు
- వర్షాల దృష్ట్యా నేడు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్ బాలాజీ
- కృష్ణా జిల్లా దివిసీమలో ఎడతెరపి లేని వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పల్నాడు జిల్లావ్యాప్తంగా వర్షాలు
- నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, పెదకూరపాడులో వర్షాలు
- బాపట్ల జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- చీరాల తీరప్రాంతంలో తెల్లవారుజాము నుంచి వర్షం
- అద్దంకిలో రాత్రి నుంచి ఈదురుగాలులతో వర్షం
- బాపట్ల జిల్లా కొల్లూరు, నగరం, భట్టిప్రోలు, చీరాల, పర్చూరులో వర్షం
- బాపట్ల జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన అధికారులు
- గుంటూరులో వర్షం, రహదారులు జలమయం
- రహదారులపై వర్షపునీటి ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బందులు
- గుంటూరు మూడు వంతెనలు, కంకరగుంట అండర్‌పాస్‌లోకి చేరిన నీరు
- నీటిని బయటకు పంపేందుకు కార్పొరేషన్ అధికారుల చర్యలు
- ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వర్షం
- అనంతపురం, తాడిపత్రిలో నిన్న సాయంత్రం నుంచి జల్లులు
- హిందూపురంలో వర్షం, రహదారులు జలమయం

### ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై మంత్రులు, సీఎస్, RTGS అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రిని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాలకు NDRF, SDRF బృందాలను పంపాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగ్గకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ, డిజాస్టర్,పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్&బీ, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్దేశించారు. బలహీనంగా ఉన్న కాలువ, చెరువు గట్లను పటిష్ట పరచాలని అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

# మహాఘట్బంధన్ సిఎం అభ్యర్ధిగా తేజస్వి యాదవ్



పాట్నా : బీహార్‌లో వచ్చే నెలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి, మహాఘట్బంధన్ పోటాపోటీగా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో మహాఘట్బంధన్ తరఫు సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ అగ్ర నాయకుడు తేజస్వి యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లాట్ గురువారం వెల్లడించారు.
కాగా, ప్రతిపక్ష కూటమి తరపున సిఎం అభ్యర్థి ఎవరనేదానిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్‌గాంధీలను సంప్రదించినట్లు గెహ్లాట్ తెలిపారు. వారితో జరిపిన చర్చలు అనంతరం తేజస్వియాదవ్‌ను ప్రతిపక్ష కూటమి తరఫు సీఎం అభ్యర్థిగా ఎన్నుకోవాలని నిర్ణయించామని గెహ్లాట్ పాట్నాలో నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పారు. ఈ సందర్భంగా ఆయన తేజస్వియాదవ్‌కు సుదీర్ఘ భవిష్యత్తు ఉందని అన్నారు. దేశంలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి పట్టించుకోవడం లేదని గెహ్లాట్ విమర్శించారు. ఎన్డీయే సర్కారు పాలనాతీరు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నదని మండిపడ్డారు. బీహార్‌లో ఎన్‌డిఎ కూటమి సర్కార్ అధికారంలో ఉండడం వల్ల నిరుద్యోగం పెరిగింది. ఈ ప్రభుత్వ తీరుతో రాష్ట్ర విసిగిపోయి.. మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

# నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా..

## పోలీసుల విచారణలో భూమన

తిరుపతి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుపతి ఎస్వి గోశాలలో అత్యధికంగా గోవులు మృతి చెందాయని గతంలో టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో గురువారం ఆయనను పోలీసులు విచారించారు. భూమన ఆరోపణలపై టిటిడి పాలక మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి మార్చి 11న ఎస్వి యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనను పోలీసులు విచారించారు. విచారణ అనంతరం మీడియాతో భూమన మాట్లాడుతూ%ౌ% గత నెలలో తనను విచారణకు పిలిచారని, తాజాగా గురువారం కూడా విచారణకు పిలిచారని చెప్పారు. డిఎస్పి భక్తవత్సలం, సిఐ రామయ్య అడిగిన ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చానన్నారు. తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ఆధారాలు లేకుండా తాను మాట్లాడనని చెప్పారు.



# 1 నుంచి డిఎల్‌డిఒల కార్యాలయాలు ప్రారంభం

## ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డివిజనల్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలు (డిఎల్‌డిఒ)ను ప్రారంభించాలని ఆదేశించారు. క్లస్టర్ విధానం రద్దు చేసి 13,531 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామ పంచాయతీలకు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని వెల్లడించారు. పల్లె పండుగ 2.0తో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి ప్రణాళిక అందించాలని ఆదేశించారు.

# వందువ ఇనాం భూముల రైతుల్ని అన్నదాత సుఖీభవ జాబితాలో చేర్చండి

## జాబితా సవరించి న్యాయం చేయాలి

### మన్యం జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులకు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు దిశానిర్దేశం



అమరావతి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇనాం భూములు, డీకేటీ పట్టాలు ఉన్న రైతులకు కూడా అన్నదాతా సుఖీభవ వర్తింప చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్రతి రైతుకీ సాయం అందాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, వందువ గ్రామ పరిధిలో ఇనాం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం వర్తించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. వందువ గ్రామ పరిధిలో 653 మంది రైతులు ఇనాం భూములు సాగు చేసుకుంటుండగా, వారికి అన్నదాతా సుఖీభవ సాయం అందలేదు. ఈ విషయాన్ని పాలకొండ శాసన సభ్యులు శ్రీ నిమ్మక జయకృష్ణ గారు గురువారం సాయంత్రం శ్రీ పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంపై తక్షణం స్పందించిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు... సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## రూ.6 కోట్లతో వాడపల్లి క్షేత్రానికి

# ఏటిగట్టు రోడ్డు

### నిధులు మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు

### కొత్తపేట శాసన సభ్యులు శ్రీ బండారు సత్యానందరావు గారి అభ్యర్ధనకు తక్షణ స్పందన

### భక్తుల సౌకర్యార్థం 7 కిలోమీటర్ల మేర ఏటిగట్టు రహదారి నిర్మాణం



కోనసీమ, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కోనసీమ తిరుమలగా పేరొందిన పవిత్ర పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి గోదావరి గట్టు మీదుగా నేరుగా చేరుకునేందుకు వీలుగా నూతన రహదారి నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆమోదం తెలిపారు. రూ.6 కోట్లు పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే వాడపల్లి క్షేత్రానికి రాకపోకలు సాగించే భక్తుల ప్రయాణ కష్టాలు తీరతాయి. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కొత్తపేట శాసన సభ్యులు శ్రీ బండారు సత్యానందరావు గారు.. శ్రీ పవన్ కళ్యాణ్ గారిని కలిసి వాడపల్లి ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరున్న వాడపల్లి ఏడు వారాల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి రోజు రోజుకీ భక్తుల రద్దీ పెరుగుతూ వస్తోందని, రావులపాలెం మీదుగా ఉన్న ప్రస్తుత రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ రద్దీతో భక్తులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. 216 జాతీయ రహదారి నుంచి ఏటిగట్టు మీదుగా 7 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తే.. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు సానుకూలంగా స్పందించి తక్షణం నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డుని అభివృద్ధి చేస్తే భక్తులు గోదావరి తీరాన ప్రయాణించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రివర్యులు చెప్పారు.

# మత్స్యకారులను క్షేమంగా తీసుకువస్తాం

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు




శ్రీకాకుళం అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బంగ్లాదేశ్ సముద్ర జలాల్లోకి ప్రవేశించి అక్కడి నేవీ అధికారులకు చిక్కిన విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన ఎనిమిది మంది మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకొస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌తో చర్చించినట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని జై శంకర్ తెలిపారని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ఉన్న ఇండియా మిషన్, కోస్టుగార్డులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## తాగునీటి కోసం తహతహలాడుతున్న

# అంతర్ల గ్రామం!

**మూడు ఏళ్లుగా ట్యాంక్ ఉన్నా...నీరు రాని దుస్థితి!**
**అంతర్ల గ్రామస్తుల వినతితో స్పందించిన డీఈఈ కరుణ**
**త్వరలో ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు భరోసా.**

**చింతపల్లి, అక్టోబర్ 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అంతర్ల గ్రామ ప్రజలు త్రాగునీటి కోసం తీవ్రంగా సతమతమవుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం గ్రామ కొండపై త్రాగునీటి ట్యాంక్ నిర్మించినప్పటికీ పైపులు, ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా మహిళలు ప్రతిరోజూ ఊటగడ్డల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. త్రాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు కవడం సోమరాజు, కవడం శివ సంతోష్, కవడం ఈశ్వరరావు, కవడం కృష్ణ, కవడం రాంప్రసాద్ తదితరులు గురువారం నీటిపారుదల శాఖ డీఈఈ కరుణను కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు మైలుదూరం నడిచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్మించిన ట్యాంక్ వినియోగంలోకి రాకపోవడంతో నిర్మాణ వ్యయం వృథా అవుతోంది. వెంటనే పైపులు వేసి ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. డీఈఈ కరుణ స్పందిస్తూ అంతర్ల గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించడానికి నీటిపారుదల శాఖ చర్యలు ప్రారంభిస్తుంది. వీలైనంత త్వరగా పైపులైన్ నిర్మాణం చేపట్టి ఇంటింటికీ నీటి సరఫరా అందిస్తాం. ప్రజలు కూడా సహకరించాలని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఎరువుల భారం రైతులపై వేయొద్దు...

### కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి.

**జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం రైతులకా? ఎరువుల కంపెనీలకా?**
**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రశ్న..**



**జంగారెడ్డిగూడెం అక్టోబర్ 23:(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ కొనసాగించేందుకు నిరాకరించటంతో ఎరువుల కంపెనీలు ఆ మేరకు ధరలు పెంచి రైతుల మీద భారం వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాయని, ఈ పరిణామంతో కాంప్లెక్స్ ఎరువులు 50 కేజీల బస్తా పైన 50 రూపాయల నుండి 100 రూపాయల వరకు ధరల భారం రైతులపై పడనున్నదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు.
గురువారం జంగారెడ్డిగూడెం లోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఎరువుల ధరలు-రైతులపై భారం అనే అంశంపై జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించామని అన్ని రకాల సరుకుల వినియోగదారులు పండుగ చేసుకోవాలని దేశమంతా ప్రచారం చేస్తూ ఉందన్నారు. ఎరువులపై ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతం కు తగ్గించామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించిందన్నారు. కానీ జీఎస్టీ పన్ను రాయితీ రైతులకు కాకుండా ఎరువుల కంపెనీలకు ప్రయోజనకరంగా మారుతున్నదని చెప్పారు. జీఎస్టీ పన్ను రాయితీల ప్రయోజనం రైతులకు దక్కేలాగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎరువుల ధరల రూపంలో 300 కోట్ల రూపాయలు అదనపు భారం రైతులపై పడనున్నదని ఆందోళన వ్యకం చేశారు. అసలే పంటలకు గిట్టుబాటు ధర లభించక, ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు పెరిగి అప్పుల పాలవుతున్న రైతాంగం పై ఎరువుల రూపంలో మరొక భారాన్ని వేయడం తగదన్నారు.
కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కాంప్లెక్స్ ఎరువులపై సబ్సిడీని కొనసాగించాలని, రైతులపై ఎరువుల భారం పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల ఉపాధ్యక్షులు బోడిక రామచంద్ర రావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్ ల్యాబుల్ వెంటనే సిద్ధం చేయాలి

**విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.**
**అల్లూరి జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాశాఖ అధికారి భీమశంకరరావు సూచన.**



**చింతపల్లి, అక్టోబర్ 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

2025%-%26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సక్రమంగా జరగేలా అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాశాఖ అధికారి ఎస్. భీమశంకరరావు సూచించారు. గురువారం ఆయన చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి ప్రాక్టికల్ ల్యాబులు, పరీక్షా కేంద్రాల ఏర్పాట్లను సమీక్షించారు. విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్ ల్యాబులు పరిశీలించిన, స్థానిక ప్రిన్సిపాల్ కె. గోవిందరావుతో పాటు బోధన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే కీలక దశ. కనుక ప్రతి విద్యార్థికి అవసరమైన ల్యాబులు, పరికరాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా క్రమశిక్షణతో నిర్వాహణ జరగాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీసం 75 శాతం హాజరు ఉండేలా పర్యవేక్షించాలి. హాజరు తక్కువగా ఉన్నవారికి తల్లిదండ్రుల ద్వారా అవగాహన కల్పించాలి. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదు. అవసరమైతే మెడికల్ చెక్అప్స్ నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న యూనిట్%-%3 పరీక్షల నిర్వహణ విధానాలపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, వంట నాణ్యత, పరిశుభ్రత, మరియు విద్యార్థులకు సమయానికి భోజనం అందించే విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఇంటర్మీడియట్ వృత్తి విద్యాశాఖ అధికారి సూచనలతో కళాశాల పరిధిలోని ఉపాధ్యాయులు, సిబ్బంది పబ్లిక్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బోధన అధ్యాపక సిబ్బంది వెంకటరత్నం, రాజం నాయుడు, ఈశ్వరరావు, ఈశ్వర్‌బాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి అభివృద్ధికి రూ.18.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతి

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**కొత్తపేట, అక్టోబర్ 23 ( తెలుగు రాష్ట్రం ):**



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలపై పలు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రహదారి సదుపాయాలు దెబ్బతిన్నాయని, వాటి పునర్నిర్మాణానికి వెంటనే చర్యలు అవసరమని తెలిపారు. మొత్తం 12 రోడ్ల నిర్మాణానికి రూ.18.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. అదేవిధంగా రావులపాలెం జాతీయ రహదారి నుంచి వాడపల్లి వరకు ఏటిగట్టు రహదారి నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. కోనసీమ వ్యవసాయ అభివృద్ధికి కీలకమైన గోదావరి డెల్టా ఆధునీకరణ పనులకు నిధులు మంజూరు చేయాలన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకోవాలని పవన్ కళ్యాణ్‌కు ఆహ్వానం పలికారు. వినతులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

## మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల రచ్చబండ ప్రారంభం

**వాడపల్లిలో కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**

**నవంబర్ 28న జరగబోయే ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించిన జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, పాటి శివకుమార్**





**ఆత్రేయపురం, అక్టోబర్ 23 ( తెలుగు రాష్ట్రం ):**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా సేకరణ రచ్చబండ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో గురువారం ఈ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి మరియు కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ హాజరయ్యారు. ముందుగా కోనసీమ తిరుమలగా పేరొందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని, ఆలయం వెనుక ఉన్న కళ్యాణ మండపంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నవంబర్ 28న జరగబోయే నియోజకవర్గ ర్యాలీ పోస్టర్‌ను జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, పాటి శివకుమార్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం జక్కంపూడి విజయలక్ష్మి తొలి సంతకం చేస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, జగ్గిరెడ్డి, పాటి శివకుమార్ తదితరులు కూడా సంతకాలు చేశారు. తర్వాత జగ్గిరెడ్డి మండల కన్వీనర్లకు, మండల పరిశీలకులకు, గ్రామ పరిశీలకులకు గ్రామ కమిటీలు మరియు సంతకాల సేకరణ పాంప్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యంకు

# గన్‌మెన్ల భద్రత

**కొత్తపేట, అక్టోబర్ 18 ( తెలుగు రాష్ట్రం):**



తెలుగుదేశం పార్టీ సీనియర్ తెలుగు రాష్ట్రంనాయకుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మరియు రాష్ట్ర శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యంకు రాష్ట్ర ప్రభుత్వం '1o1' గన్‌మెన్ల భద్రతను కేటాయించింది. భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని హెూం శాఖ తక్షణ చర్యగా ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం ఈ నెల 18న ఇద్దరు పిఎస్‌ఓలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాల ప్రకారం జి. బాలకృష్ణ మరియు జె. వెంకట రమణ అనే ఇద్దరు పిఎస్ఓలు సుబ్రహ్మణ్యం గారికి భద్రతా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. స్థానిక నేతలు, పార్టీ కార్యకర్తలు ఈ నిర్ణయాన్ని సుబ్రహ్మణ్యం గారి దీర్ఘకాల సేవలకు ప్రభుత్వ గుర్తింపుగా పేర్కొన్నారు. టీడీపీ శ్రేణులు, ఆయనకు త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో ఉన్నత పదవి దక్కాలని, చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఆశీస్సులతో మరింత రాజకీయ స్థాయిలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## జనసేన సైనికులారా..! స్థానిక సంస్థల సమరానికి

# సిద్ధం కండి!

**ప్రజల మధ్యే గెలుపు**
**సమస్యల పరిష్కారమే అసలైన సేవ.**
**చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి.**




**చింతపల్లి, అక్టోబర్ 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన శక్తిని ప్రజలకు చూపించే సమయం ఆసన్నమైందని చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం పాడేరు కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సైనికులు ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. గ్రామాల్లో తాగునీటి సమస్యల నుండి రోడ్లు, విద్యుత్, వైద్య సేవల వరకు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ప్రజలకు అందుబాటులో ఉండటం ద్వారా పార్టీ బలం సహజంగానే పెరుగుతుందన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో కనీసం 10 మంది చొప్పున కోర్ కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామ సమస్యలు, ప్రజా అవసరాలపై డేటా సేకరించాలని సూచించారు. ఈ కమిటీల ద్వారా పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి చేర్చడం, జనసేనకు అనుకూల వాతావరణం సృష్టించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నిర్మాణం దశలవారీగా బలోపేతం అవుతోందని తెలిపారు. ఎన్నికల వ్యూహరచనలో గ్రామీణ, పట్టణ స్థాయిలకు వేర్వేరు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. గెలుపు గుర్రాలకే పార్టీ టికెట్లు లభిస్తాయి. టికెట్ రాకపోయినా పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలి. సమన్వయం, సేవాభావం, క్రమశిక్షణ, ఇవే జనసేన సైనికుడి బలం అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన గంగులయ్య మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజల ఆలోచనల్లో ఒక కొత్త చైతన్యాన్ని నింపింది. గ్రామీణ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మార్పు తీసుకురావడమే జనసేన ధ్యేయం. అందుకే ప్రతి కార్యకర్త ప్రజలతో నిత్యం మమేకమై ఉండాలన్నారు. అదేవిధంగా పార్టీ తరపున బూత్ స్థాయిలో బాధ్యతలు కేటాయించి, జనసేన సైనికులు ఇంటింటికి ప్రచారానికి సిద్ధం కావాలని సూచించారు. త్వరలోనే మండల స్థాయి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనలు, ప్రచార పద్ధతులపై మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామకృష్ణ, లక్ష్మణరావు, ధారబాబు, పిసా కమిటీ సభ్యులు, మండల స్థాయి నాయకులు, గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న ఆలయంలో

# పలు వేలం పాటలు



**ఆత్రేయపురం అక్టోబర్ 23( తెలుగు రాష్ట్రం)**

కోనసీమ తిరుమల శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గురువారం పలు వేలంపాటలు నిర్వహించారు. ఒక సంవత్సర కాలానికి గాను ఆలయంలో కొబ్బరి చెక్కల పాటకు రూ.1,56,60,600లు పలికింది. గత సంవత్సరం ఇది రూ.60,77,889లుగా నమోదైంది. అలాగే పటికబెల్లం పాటకు రూ.18,09,000లు (గతంలో రూ.12,35,000లు), తిలకధారణ పాటకు రూ.17,99,999లు (గతంలో రూ.15,66,666లు)గా పలికింది. వేలంపాటలు బహిరంగ వేలం, షీల్డ్ టెండర్లు, ఆన్‌లైన్ టెండర్ల రూపంలో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ వేలం పాటల్లో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు-రేపు మావోయిస్టుల భారత్ బంద్

## చింతపల్లిలో ముమ్మర వాహన తనిఖీలు!


- వర్షంలోనూ అప్రమత్తంగా పోలీసులు
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు.
- చింతపల్లి ఎస్సై-2 వెంకటరమణ.

**చింతపల్లి, అక్టోబర్ 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

ఇతర రాష్ట్రాల్లో మావోయిస్టులు భారీ ఎత్తున లొంగుబాటు కావడాన్ని నిరసిస్తూ ఈ నెల 24, 25 తేదీలలో మావోయిస్టులు భారత్ బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో చింతపల్లి పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. చింతపల్లి సబ్‌డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు సీఐ ఎం. వినోద్‌బాబు పర్యవేక్షణలో, ఎస్సై-2 ఎం. వెంకటరమణ ఆధ్వర్యంలో ముమ్మర వాహన తనిఖీలు కొనసాగుతున్నాయి. గురువారం రోజున చింతపల్లి టీ జంక్షన్, లోతుగడ్డ జంక్షన్, లోతుగడ్డ వంతెన వద్దతో పాటు జనసంచారం అధికంగా ఉండే ఇతర ప్రధాన కూడళ్లలో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. వాహనదారుల ఆధార్, గుర్తింపు కార్డులను పరిశీలించి, అవసరమైతే వ్యక్తిగత వివరాలు సేకరించి వదిలిపెడుతున్నారు. బంద్ సమయంలో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ







మాట్లాడుతూ ప్రజల భద్రత మా మొదటి కర్తవ్యం. మావోయిస్టుల బంద్ పిలుపు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ పరిణామాలు జరగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశాం. ప్రజలు సహకరించాలని కోరుకుంటున్నాం అని తెలిపారు. వర్షం కురుస్తున్నా పోలీసులు తడిసి ముద్దవుతూ రహదారులపై వాహన తనిఖీలు కొనసాగించారు. రహదారులపై బైక్ రైడర్లను ఆపి విచారణ జరిపిన దృశ్యాలు ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించాయి. ఈ తనిఖీల కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నీట మునిగిన రోడ్లు ఇబ్బందుల్లో ప్రజలు



**ముమ్మిడివరం, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** నియోజవర్గ పరిధిలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ. పోలవరం మండలాల్లోని బుధవారం నుండి ఎడతెరిపిలేని వర్షం కురవడంతో రహదారులు జలమయంగా మారాయి. జనజీవనం పూర్తిగా స్తంభించి పోయింది. ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. వ్యాపార సముదాయాలు మూత పడ్డాయి. అధికారులు విద్యాలయాలకు సెలవు ఇవ్వకపోవడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అకాల వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ముమ్మిడివరంలో హాస్పటల్ రోడ్డు, బల్ల గేటు సెంటర్ నుండి జనతా హాస్పిటల్ వరకు రోడ్డు మొత్తం నీటిమునగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## తహసిల్దార్ బాధ్యతలు స్వీకరించిన రవికిరణ్



**కాట్రేనికోన, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రవికిరణ్ తహసీల్దార్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న సుబ్బలక్ష్మి జిల్లా కలెక్టర్ వారి కార్యాలయానికి బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో రవికిరణ్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రవికిరణ్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి సాయిబాబా, మండల సర్వేయర్ రాజశేఖర్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

## జాతీయ రహదారి నిర్మాణ సిబ్బందికి టీడీపీ నాయకుల వినతి పత్రం




**ఎటపాక, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండల పరిధిలోని లక్ష్మి పురం పంచాయతీలో నూతన జాతీయ రహదారి నిర్మాణ పనుల వలన గ్రామంలో వాటర్ పైపు లైను పాడైందని, వీధి పైపులైను త్వరగా ఏర్పాటు చేయాలని స్థానిక టీడీపీ నాయకులు కనితి మధు, ఉండేటి రమేష్ తెలియజేశారు. అలాగే నూతన జాతీయ రహదారి వలన లింగాలపల్లి గ్రామం మీదగా గతంలో రోడ్డు ఉండేదని ఆ గ్రామానికి అనుకొని ఉన్న మిగతా మూడు గ్రామాల ప్రజలు లింగాలపల్లి రహదారి వద్దకు వచ్చి బస్సులు, ఆటోలు ఎక్కి ప్రయాణం చేసేవారని గుర్తు చేశారు. ఇప్పుడు నూతన హైవే రహదారి నిర్మాణం వలన లింగాలపల్లి గ్రామం ఊరి బయట నుంచి హైవే నిర్మాణం జరిగిందని సుమారు నాలుగు గ్రామాల ప్రజలు లింగాలపల్లి గ్రామం నుంచి నూతన జాతీయ రహదారి వద్దకు వచ్చి ప్రయాణం చేయవలసి ఉందని, వారికి ఆ ప్రయాణ ప్రాంతం పాయింట్ వద్ద రెండు నూతన బస్టాండ్లు నిర్మించాలని, బూరుగువాయి తండా వద్ద కూడా నూతన బస్టాండ్ ఒకటి నిర్మించాలని అధికారులకు వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి నిర్మాణ సిబ్బంది నాగరాజు, లక్ష్మీపురం తెలుగుదేశం పంచాయతీ కమిటీ సభ్యులు తెలియజేశారు. దీనిపై వారు స్పందించి మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులుగా ముప్పనబోయిన నాగరాజు



**కూనవరం, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి భాస్కర్ ఆదేశాల మేరకు కూనవరం మండల తెలుగుదేశం బీసీ సెల్ కమిటీని ప్రకటించారు. బీసీ సెల్ అధ్యక్షులుగా ముప్పినబోయిన నాగరాజు, ఉపాధ్యక్షులుగా గాది నారాయణ, గొట్టాల రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా పొనగంటి శ్రీను, కార్య నిర్వహణ కార్యదర్శులు పెద్దారపు నాను, కురి ప్రశాంతు, నిరుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పరిటాల భవాని శంకర్, నాలి వెంకట్రావు, బండారు శివయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బరపాటి ప్రకాశరావు, ఉపాధ్యక్షులు చెలికాని ఉమామహేశ్వర రావు, తెలుగు రైతు అధ్యక్షులు లంబు వాసు, యూనిట్ ఇన్చార్జులు దాసరి నాగేశ్వరావు, కుంజ వెంకట్, మోసం రాము మల్లం నరసింహారావు, గ్రామ కమిటీ అధ్యక్షులు హెచ్ రవి, పారి సోమయ్య, గడ్డల భీమయ్య, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యవర్గ సభ్యులు చిన్ని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక అభివృద్ధికి రూ.5 లక్షలు విరాళం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్23 (తెలుగురాష్ట్రం విలేకరి):** పెంటపాడు మండలంలోని జట్లపాలెం గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధికి ముందుకొచ్చిన కొడూరి కుటుంబం ముందుకొచ్చింది. కీ.శే.కోడూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి మనవడు కోడూరి రోహన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చిన పి 4 లో భాగంగా జట్లపాలెం గ్రామ స్మశాన వాటిక అభివృద్ధికి రూ 5లక్షల రూపాయల విరాళాన్ని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కు గురువారం అందజేశారు. పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస్ వర్మ వారి ఎంపీ నిధుల నుండి రూ 10 లక్షల రూపాయలు అందించనునప్పటికి స్మశానవాటిక అభివృద్ధికి మరింత వ్యయం అవుతున్న క్రమంలో కోడూరి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని, వారిని జట్లపాలెం "శ్రీమంతులు"గా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. డబ్బు ఉన్న ప్రతి ఒక్కరూ దానం చేయరని దానం చేసే వారే నిజమైన శ్రీమంతులని కొనియాడారు. స్మశాన వాటికలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటయ్యే రీతిగా పార్కును కూడా తీర్చిదిద్దాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలు కోడూరు సుబ్బారావు వారి కుమారుడు రోహన్ , కోడూరి కాశీ, నలమాటి సూర్య ప్రకాష్, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, సర్పంచ్ మణిరాజు, మైలవరపు పెదబాబు, కూచిపూడి అనిల్ కుమార్, పాశం రమణ, వల్లేపల్లి గోపాలకృష్ణ, కుదుళ్ల శ్రీను, పరమానంద చౌదరి, కుదుళ్ళ చంద్రశేఖర్, కాంట్రాక్టర్ శివ, మైలవరపు వాసుకుమార్, ఆకుతీగపడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, కోడూరిసుధీర్ కుమార్, కుదుళ్ళ ప్రసాద్, పెనుబోతుల బాలాజీ, ఆరపరెడ్డి జగ్గారావు, కోడూరు విజయకుమార్, వల్లేపల్లి మనోహర్, కోరశిక కుమార్, మునేశ్వరరావు, జట్లపాలెం గ్రామం పెద్దలు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అమరజీవి పూనెం సత్యనారాయణ స్థూపావిష్కరణ

**వి.ఆర్. పురం, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద అమరజీవి కామేడ్ పూనెం సత్యనారాయణ స్మారక స్థూపాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాదం ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు సున్నం రాజులు జండా ఆవిష్కరించారు. అనంతరం రేఖపల్లి జంక్షన్ నుంచి సిపిఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో ప్రథమ వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. ఈ స్థూప ఆవిష్కరణ సభకు మండల సిపిఎం కార్యదర్శి పులి సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లోకనాదం మాట్లాడుతూ సత్యనారాయణ లేని లోటు పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు. కొద్దికాలంలోనే నాలుగు ప్రధాన నేతలను కోల్పోయిన పార్టీ, ఉన్న నాయకత్వం వెనక్కు తగ్గకుండా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడాన్ని అభినందించారని అన్నారు.



రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం ఎర్రజెండా చేతపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రయత్నించిన పూనెం సత్యనారాయణ మన దూరం కావడం బాధాకరమన్నారు. మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. బొజ్జి, సున్నం రాజయ్య, శిరమయ్య, సత్యనారాయణ వారసత్వం తీసుకుని మనం కూడా ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పోరాడాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సభలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ మాట్లాడుతూ సత్యనారాయణ మరణం పార్టీకి తీవ్ర లోటుగా పేర్కొన్నారు. తనను ప్రోత్సహించిన నాయకుడు ఇకలేడన్న బాధను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, సీసం సురేష్, కాక అర్జున్, మడకం నాగమణి, బాబు బొర్రయ్య, సోయం చినబాబు, సత్యనారాయణ భార్య పూనెం సరోజిని, కుమారులు ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, కిరణ్ కుమార్, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు సవలం మారయ్య, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ, రాజయ్య కుటుంబ సభ్యులు చుక్కమ్మ, చందరావు, లక్ష్మి, శిరమయ్య కుటుంబ సభ్యులు, తెలంగాణ సిపిఐ నాయకురాలు సీతామహాలక్ష్మి, మహిళా సంఘం జిల్లా నాయకురాలు పద్మ, రంగమ్మ, రాజేశ్వరి, పి.ఎన్.యం నాయకులు ఐవి, ఆసు లక్ష్మయ్య, అచ్యుతరావు, సుబ్బారావు, వైస్సార్సీపీ నాయకులు పొడియం గోపాల్, పిట్టరామారావు, తెలుగుదేశం నాయకులు ముత్యాల రామారావు, ఆచంట శ్రీనివాస్, బొర్రా నరసింహారావు, బీరక. సూర్యప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు లీలాకృష్ణ, సర్వరాజ్, సిపిఎం మండల నాయకత్వం పాల్గొన్నారు.

## మినుములు, పెసలు పంపిణీ



**కూనవరం, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండల పరిధిలోని చిన్నార్కూర్ పంచాయితీ సచివాలయంలో మినుములు, పెసలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సున్నం అభిరామ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మణరావు, పిసా ఉపాధ్యక్షులు సోడే ముత్తయ్య, ప్రకృతి వ్యవసాయం విభాగం సోడె రమాదేవి (యూనిట్ ఇన్చార్జి), సోడె రమాదేవి (ఐసిఆర్పి పంద్రాజుపల్లి), సోడె సీత (ఐసిఆర్పి- చిన్నార్కూర్ ) చిన్నార్కూర్, పంద్రాజుపల్లి, వెంకన్నగూడెం, శ్రీరాంపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏపీ నిట్‌లో నూతన ల్యాబ్‌ను ప్రారంభం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేకరి):** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని బృందావనం భవనంలో రూ 1.65 కోట్లతో ఏర్పాటుచేసిన సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ -ఎక్స్ ఆర్ డి ల్యాబ్ ను నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ స్ఫటికాకార పదార్థాల పరమాణు, పరమాణు నిర్మాణాన్ని విశ్లేషించడానికి ఎక్స్ రే డిఫ్రాక్షన్ (ఎక్స్ ఆర్ డి) పరికరాలను ఉపయోగిస్తారని చెప్పారు. మెటీరియల్ క్యారెక్టరైజేషన్, నాణ్యత నియంత్రణ కోసం మెటీరియల్ సైన్స్, ఫార్మాసిటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో ఉపయోగిస్తారని తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు ఆధునిక సాంకేతిక పరికరాలతో కూడిన ఈ ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందని, ల్యాబ్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని వివరించారు. సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ చైర్మన్, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆచార్యులు డాక్టర్ జే.కృష్ణమూర్తి, డాక్టర్ పి.తపస్ కో ఆర్డినేటర్ లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కే.హిమబిందు, డాక్టర్ వీరేశ్ కుమార్, పలువురు అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ

**చింతలపూడి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేకరి):** చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న డా.వి.మదన్ మోహన్ రచించిన 'జీనోమిక్ సీక్వెన్సింగ్ - బయో ఇన్ఫర్మాటిక్స్' పుస్తకాన్ని ప్రిన్సిపాల్ డా. పి . శ్రీనివాస రావు ఆవిష్కరించారు.



సీనియర్ అధ్యాపకులుగా పని చేస్తూ, విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక సమాచారాన్ని పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయం అని, ఇలాంటివి చదవడం ద్వారా సరికొత్త విషయాలు నేర్చుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం, విద్యార్థులు, అధ్యాపకులు మదన్ మోహన్ కు అభినందనలు తెలిపారు.

## అభిమానుల సేవా కార్యక్రమాలే హీరోలకు వరాలు

### -ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్
### -అశోక్ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం చేసిన ప్రభాస్ ఫ్యాన్స్

**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేకరి):** బడుగు, బలహీనవర్గాల ప్రజలకు కథానాయకుని అభిమానులు చేసే సేవా కార్యక్రమాలే ఆ అభిమానులు ప్రేమించే హీరోల పాలిట ఆరోగ్య వరాలుగా మారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అభిమానులకు కనులవిందు చేస్తాయని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం శ్రీ శ్రీ కాన్ ఫ్లెక్స్ సినిమాస్ థియేటర్ లో సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దినేష్ యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి బొలిశెట్టి శ్రీనివాస్ భారీ కేకు కట్ చేసి ప్రభాస్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరో ప్రభాస్ సేవాదృక్పథంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తారని, అదే స్ఫూర్తితో వారి అభిమానులు పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అభిమానులకు తన సహాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన అశోక్ కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కొనియాడారు. జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ డార్లింగ్ ప్రభాస్ సినీ పరిశ్రమలో మంచి మనసున్న వ్యక్తి అని, త్వరలో విడుదల కానున్న రాజా సాబ్ చిత్రం మంచి విజయాన్ని



అందుకుంటుందన్నారు. ప్రతియేటా ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలలో తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా, పుల్లా బాబి, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## పశువుల సంత బహిరంగ వేలం



**చింతూరు, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం విలేకరి):**
చట్టి గ్రామ పంచాయతీ వద్ద వారపు పశువుల సంతకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో చట్టి, వీరాపురం గ్రామస్థులు పాల్గొన్నారు. వీరిలో వీరాపురం గ్రామానికి చెందిన పీసం సత్తిబాబు హెచ్చు పాటదారునిగా నిలిచి పశువుల సంత పాట హక్కును కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి రవ్వ భద్రమ్మ, ఉప సర్పంచ్ రాములు, డిప్యూటీ ఎంపీడీఓ ఆర్. వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ, పెసా కమిటీ ఉపాధ్యక్షులు తుర్రం చినముత్తయ్య, కార్యదర్శి పొడియం రామకృష్ణ, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీమతి రవ్వ భద్రమ్మ అధ్యక్షతన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) గ్రామ సభ జరిగినది. ఈ గ్రామ సభలో డిప్యూటీ ఎంపీడీవో ఈ గ్రామ సభ యొక్క ప్రాధాన్యతను వివరించి గ్రామ అభివృద్ధికి సంబంధించిన అనేక విభాగాల అంశాలను క్రోఢీకరించి ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. గ్రామస్తులు వారి సమస్యలను తెలియజేసి త్వరితగతిన పరిష్కరించగలరని విన్నవించుకున్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా చట్టి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించి వీలైనంత త్వరగా గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ గ్రామసభలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి, ఆశ, డ్వాక్రా యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## జిఎస్టీ తగ్గింపు.. ప్రజల ఆర్థిక భద్రత..

### నరేంద్ర మోదీ చారిత్రాత్మక నిర్ణయం
### బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్23 (తెలుగురాష్ట్రం విలేకరి):**
దేశంలో వస్తు సేవల పన్ను రేట్లు (జిఎస్టీ)తగ్గిస్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చరిత్రత్మాక నిర్ణయం తీసుకున్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి ప్రశంసించారు. జిఎస్టి తగ్గింపు అమలు తీరును పరిశీలించేందుకు గురువారం స్థానిక డి. మార్ట్, విజేత షాపింగ్ మాల్ లను బిజెపి నాయకులతో కలిసి సందర్శించారు. మాల్ లోని సిబ్బందిని జీఎస్టీ తగ్గించక ముందు, తగ్గించిన తర్వాత వివిధ వస్తువుల ధరలను అడిగి తెలుసుకున్నారు. జిఎస్టి తగ్గింపు నిత్యవసర వస్తువులు ధరలు అంశాలపై వస్తువుల కొనుగోలు నిమిత్తం మాల్ కు వచ్చిన వినియోగదారులను వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ వస్తువుల ధరలు జిఎస్టి తగ్గకముందు ధరలను, ప్రస్తుత ధరలను ఆయా వస్తువుల వద్ద ప్రదర్శించాలని డిమార్ట్ మాల్స్ యాజమాన్య ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా భోగి రెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వస్తు సేవల పన్నుల స్లాబులను (జిఎస్టి) కుదించి పన్నురేట్లను గణనీయంగా తగ్గించిందన్నారు. దీని వల్ల సామాన్య పేద ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఏటా కనీసం రూ15 నుంచి రూ 50 వేల రూపాయలు ఒక కుటుంబానికి ఆదా అవుతుందన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగించడం ద్వారా మన దేశ ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఏ ప్రభుత్వము అమలు చేయని విధంగా వస్తు సేవల పన్ను రేట్లను తగ్గించి సామాన్య పేద ప్రజలు పై ఆర్థిక భారాన్ని తగ్గించిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి సామాన్య పేద ప్రజలకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూర్చిందని కొనియాడారు. జీఎస్టీ తగ్గుదల ప్రయోజనం పొందుతున్న ప్రజలంతా ఈ విషయాన్ని అందరికీ తెలియజేప్పాలని కోరారు. బిజెపి నాయకులు సురేష్ రెడ్డి మాట్లాడుతూ జిఎస్టి స్లాబులను గురించి పన్నులను తగ్గించడం ద్వారా దేశ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చిన ఘనత కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వంకు దక్కుతుందన్నారు. మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పడాల కావ్య రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం తీసుకొని విధంగా జిఎస్టి పనులం తగ్గించి ప్రజలందరికీ ఆర్థిక ప్రయోజనం చేకూర్చిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానిదేనన్నారు. బిజెపి నియోజకవర్గ కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ నిత్యవసర వస్తువులు, వినియోగ వస్తువులు పై పన్ను స్లాబులను కుదించి ధరలు గణనీయంగా తగ్గటానికి చర్యలు తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి నాయకులు పార్టీ పాటే నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం తీసుకొని విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వస్తు సేవల పనులను తగ్గించి ప్రజలకు మేలు చేకూర్చిందన్నారు. ఎస్సీ జిల్లా కార్యదర్శి విఆర్ విఎల్ నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల అన్ని వస్తువులు ధరలు తగ్గడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, వన్నెం రెడ్డి నవీన్ పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ ఫిర్యాదులను నిర్ణీత గడువులోపుగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై వివిధ శాఖల జిల్లా అధికారంతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 2025 నుండి 10,884 పి జి ఆర్ ఎస్ విజ్ఞాపనలను పరిష్కరించడం జరిగిందన్నారు. పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులను సక్రమంగా పరిష్కరించినది, లేనిది లోపాలను గుర్తించడానికి నియమించిన ప్రీ ఆడిట్ కమిటీ సభ్యులు 8,515 విజ్ఞాపనలకు సంబంధించి ప్రీ ఆడిట్ కమిటీ తనిఖీ నిర్వహించగా 6,429 కేసులు పరిష్కారం సక్రమంగా ఉందని 76% మంది ఫిర్యాదుదారులు సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగిందన్నారు. 2,185 ఫిర్యాదులకు సంబంధించి వివిధ కారణాలను తెలుపుతూ సక్రమంగా పరిష్కరించలేదని ఫిర్యాదారుల అభిప్రాయాన్ని ప్రీ ఆడిట్ కమిటీకి వెలిబుచ్చడం జరిగింది. వీటిలో ప్రధానంగా సరైన ఎండార్స్మెంట్ ఇవ్వలేదని, ఫోటో సరిగ్గా కనిపించడం లేదని, క్రింది స్థాయి అధికారులకు అప్పగించడం ద్వారా సరిగ్గా పరిష్కారం కాలేదని, సంబంధిత అధికారులు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడలేదని, తదితర అంశాలపై ఫిర్యాదారులు ప్రీ ఆడిట్ కమిటీ తనిఖీల్లో అభ్యంతరాలను వ్యక్తం చేయడం జరిగిందన్నారు. జిల్లా అధికారులు వీటిని పునః పరిశీలన చేసి లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు.

## ఆసియాన్ సదస్సుకు ప్రధాని మోడీ గైర్హాజరు

### ట్రంప్ నుండి తప్పుకోవడానికేనన్న కాంగ్రెస్



న్యూఢిల్లీ : ఈ వారాంతంలో జరగనున్న ఆసియన్ సదస్సుకు ప్రధాని మోడీ హాజరు కావడం లేదని అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ప్రధాని మోడీ కూడా సోషల్ మీడియా పోస్టులో ఈ విషయం తెలిపారు. ఈ సదస్సులో తాను వర్చువల్‌గా పాల్గొంటానని చెప్పారు. సదస్సుకు ఎందుకు హాజరు కావడం లేదో కారణాన్ని విదేశాంగ శాఖ వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి జై శంకర్ నేతృత్వంలో భారత ప్రతినిధి బృందం ఆసియాన్ సదస్సుకు హాజరవుతుందని తెలుస్తోంది.

**ట్రంప్ నుంచి తప్పించుకోవడానికే,,**

%ప్రధాని ఈ సదస్సుకు గైర్హాజరు కావడంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతిలో చిక్కడం ప్రధాని మోడీకి ఇష్టం లేదని, అందుకే ఈ సదస్సుకు గైర్హాజరవుతున్నారని వ్యాఖ్యానించింది. ఆపరేషన్ సిందూర్‌ను తామే నిలిపివేశామని ఇప్పటికి 53సార్లు, రష్యా నుండి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తామని భారత్ హామీ ఇచ్చిందని ఐదుసార్లు చెప్పుకున్న ట్రంప్‌తో కలిసి మెలిసి తిరగడమంటే ప్రధాని మోడీకి చాలా ప్రమాదకరమైన విషయమని కాంగ్రెస్ కమ్యూనికేషన్ వ్యవహారాల ప్రతినిధి జైరాం రమేష్ పేర్కొన్నారు. ట్రంప్ కూడా ఈ సదస్సుకు రావడమే ప్రధాని మోడీ గైర్హాజరు కావడానికి కారణమన్నారు. కొన్ని వారాల క్రితం ఈజిప్టులో జరిగిన గాజా శాంతి ఒప్పంద ఖరారు సమావేశానికి హాజరు కావాలని ప్రధాని మోడీకి ఆహ్వానం అందిందని, ట్రంప్ హాజరవుతున్నారనే కారణం వల్లే తిరస్కరించారని జైరాం రమేష్ అన్నారు.

## కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించండి

### విద్యుత్ సమీక్షలో సిఎస్ విజయానంద్



**అమరావతి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
నిరంతరం నాణ్యమెన సరఫరా కోసం విద్యుత్ కొనుగోళ్ల విషయంలో విద్యుత్ సంస్థలు కచ్చితమైన, ఆర్థికపరమైన జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అధికారులను ఆదేశించారు.నవంబర్ విద్యుత్ కొనుగోలుపై విద్యుత్ సంస్థల అధికారులతో గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట ఉత్పత్తి సాధించేందుకు బొగ్గు నిల్వలు తగినంతగా ఉంచేందుందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విటిపిఎస్, ఆర్‌టిపిపి ప్లాంట్ల పనులు మార్చి నాటికి పూర్తయ్యేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు తగిన చట్టపరమైన అనుమతులు త్వరగా పొందడం, టెండర్లు ప్రారంభించడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు..ఈ సమావేశంలో జెన్‌కో ఎండి ఎస్ నాగలక్ష్మీ, ట్రాన్స్‌కో జెఎండి జి సూర్యసాయి ప్రవీణ్ చంద్, రెండు సంస్థల డైరెక్టర్లు ఏకెవి భాస్కర్, జెవి రావు, ఎన్‌వి రమణమూర్తి, , ఎం సుజయ కుమార్, పి అశోక్ కుమార్ రెడ్డి, ఎపిపిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ ఎండి ఎం కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ

- క్రల్తీ మద్యం మాఫియా మూలాలు వైసీపీలో ఉన్నాయి
- జ్రోగి రమేష్ అడ్డంగా బుక్కయినా ఇంకా కూటమిపై అడ్డగోలు ఆరోపణలు
- భ్రరత్ చూపు కూడా కూటమి వైపే ఉందా?




**రాజమహేంద్రవరం, అక్టోబర్ 23(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ అని, అది వారి వారసత్వ సంపద అని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) విమర్శించారు. కల్తీ మద్యం మాఫియా మూలాలు వైసీపీలో ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం అంశంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ అడ్డంగా బుక్కయినా ఇంకా కూటమిపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో నాసిరకం మద్యం అమ్మకాలు జరపడం వల్ల తాగిన వారిలో ఎంత మంది లివర్ దెబ్బతిని ఆసుపత్రుల పాలయ్యారో రికార్డులు చెబుతున్నాయని ఆయన అన్నారు. జగన్ జమానాలో ఆనాడు జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది ప్రాణాలు కోల్పోయారని, అక్కడికి పరిశీలనకు వెళ్ళిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలను రానివ్వకుండా ఎంత ఇబ్బంది పెట్టారో అందరికీ తెలుసని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కల్తీ మద్యంపై స్పెషల్ టాస్క్ ఫోర్సు వేయడంతో వైసీపీ వారి గుండెల్లో దడ మొదలైందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. వారు చేసిన తప్పులకు, పాపాలకు మొన్నటి ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించి 11 సీట్లకు పరిమితమితం చేసి ఇంట్లో కూర్చోబెట్టినా ఇంకా వైసీపీ నాయకులు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కల్తీ మద్యాన్ని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ను ప్రవేశపెట్టారని, ఈ యాప్ వల్ల మద్యం విక్రయాల్లో పారదర్శకత ఉంటుందని ఆయన చెప్పారు. దీపావళి రోజున రాష్ట్రంలో అందరూ సంతోషంగా ఉంటే వైసీపీ నాయకులు ఈసురోమంటూ ఉన్నారని ఆయన విమర్శించారు. పండుగ రోజు కూడా రాష్ట్ర విద్య ఐటి శాఖ మంత్రి లోకేష్ అస్ట్రేలియాలో ఉండి పెట్టుబడులు పరిశ్రమలు కోసం కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కొనియాడారు. ఎనిమిదేళ్ళ క్రితం అస్ట్రేలియాకు నిలిచి పోయిన ఎగుమతులు లోకేష్ చొరవతో మళ్ళీ మొదలయ్యాయని ఆయన చెప్పారు. ఇప్పటికే గూగుల్ కాగ్నిజెంట్ తదితర సంస్థలు తెచ్చారని కూటమి అజెండాను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ సహకారంతో ఇది సాధ్యమవుతోందని ఆయన చెప్పారు. రాజమండ్రిలోని వైసీపీ నాయకులు లోకేష్ కృషిని తక్కువ చేసి మాట్లాడుతున్నారని వైసీపీ పాలనలో కోడిగడ్ల మంత్రిగా పేరుగాంచిన గుడివాడ అమరనాథ్ అప్పుడు ఏదో ఊడబొడిచినట్లు వారు బిల్డప్ లు ఇస్తున్నారని, వారి రాజకీయ పరిణితి అలా ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శించారు. గూగుల్ ఏపీకి రావడంతో తమిళనాడులో రాజకీయ రగడ మొదలైందని, అధికార డీఎంకేను ప్రతిపక్ష అన్నా డిఎంకె అసెంబ్లీలో విమర్శించిదని ఆయన గుర్తు చేశారు. ఇది చూసైనా అర్థం చేసుకోవాలని కాని ఇక్కడి రాజకీయాల్లో వైసీపీ ఉండడం రాష్ట్ర దౌర్భాగ్యం అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. మంచిని స్వాగతించలేక, జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక పోతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. వైసీపీ రాజకీయాలు చండాలంగా తయారయ్యాయని, ఆ పార్టీ నేతల్లో రాజకీయ వ్యభిచారం పెరిగిపోయిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. రాజమండ్రి సిటీలో కూడా మాజీ ఎంపీ, వైసీపీ నగర అధ్యక్షుడు మార్గాని భరత్ రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో టీడీపీలో ఓ కార్పొరేషన్ చైర్మన్ గా చేసిన పాలిక శ్రీను 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే వైసీపీలో భరత్ పక్కన చేరి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ను తిట్టారని, వైసీపీ అధికారం కోల్పోగానే ఇప్పుడు టీడీపీలో చేరడానికి తమ ఇళ్ళ చుట్టూ తిరుగుతున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. అలాగే భరత్ పక్కన ఉండి పదవులు పొందిన పుణ్యదంపతులు కూడా ఇప్పుడు కూటమి పార్టీల్లో చేరడానికి తిరుగుతున్నారని కొత్తా బాలమురళీకృష్ణ, విజయ రాజ్యలక్ష్మి దంపతులను ఉద్దేశించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శించారు. చంద్రబాబు రాజమండ్రి జైలులో ఉన్న సమయంలో నారా భువనేశ్వరి పూజలు చేయడానికి ఒక దేవాలయానికి వెళితే దర్శనం చేయడానికి ఇబ్బంది పెట్టిన ఆ పుణ్యదంపతులు ఇప్పుడు కూటమి నేతల కాళ్ళు చుట్టూ తిరుగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. వైసీపీ వారు తమ కూటమి పార్టీల్లో చేరడానికి పొర్లుదండాలు పెడుతున్న రాజకీయ సన్నాసులని, అనపర్తి వరకు కారులో కూటమి సీనియర్ నేత కాళ్ళు పిసుకుతూ వెళ్ళాడని, అయినా తాము వారిని స్వాగతించాలి కదా అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. పార్టీ కష్ట కాలంలో, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తమ పార్టీ జెండా మోసిన వారిని తాము గౌరవించుకుంటాము కాని వైసీపీ వారిని కాదని ఆయన అన్నారు. వైసీపీ వారు తమ చుట్టూ తిరుగుతున్నా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే పరిస్తితిలో భరత్ లేదని, బహుశా అతను కూడా కూటమి పార్టీల్లో చేరడానికి చూస్తున్నాడా అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులంతా ఒకే మాటమీద ఉన్నామని ఆయన చెప్పారు. అధికారం అనుభవించడం అలవాటై ప్రతిపక్షంలో ఉండలేక పోతున్నారని, కాని ప్రతిపక్షంలో ఉండి పోరాడితేనే నాయకుడిగా ఎదుగుతారని ఆయన అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు పొంది ప్రతిపక్షంలో ఉండగా అధికార పక్షంలో చేరడానికి వస్తున్న వారు స్వార్థ రాజకీయ నాయకులని ఆయన విమర్శించారు.
సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని బాలికలను తలిదండ్రులతోనే పంపించాలని, బయటకు వెళ్ళినప్పుడు ఆ వివరాలు రిజిస్టర్ సక్రమంగా నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఆకతాయిలు హాస్టళ్ళ వద్ద తిరిగితే సమీప పోలీసు స్టేషన్ లో తెలియచేయాలని సూచించారు. ఆడపిల్లల జోలికి వస్తే కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చర్యలు చాలా కఠినంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, పిక్కి నాగేంద్ర, వై.శ్రీను, అడబాల రామకృష్ణారావు, అక్కిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ వ్యాధితో బాధ పడుతున్న యువతికి అరుదైన చికిత్స

### హీమటాలజిస్టు డా. కరుణ కుమార్




**రాజమండ్రి సిటి, అక్టోబర్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న 22 ఏళ్ల యువతికి సికింద్రాబాద్ యశోదా హాస్పిటల్ లో మెచ్డ్ సిబ్లింగ్ ఆలోజెనిక్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రముఖ హీమటాలజీ, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ డాక్టర్ కె.కరుణ కుమార్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం స్థానిక యశోద ఆసుపత్రిలో గురువారం జరిగిన మీడియా సమయంలో ఆయన మాట్లాడుతూ.. “ రోగి సోదరుడు స్టెమ్ సెల్ దాతగా నిలిచారని, అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో, అనుభవజ్ఞులైన వైద్య బృందం పర్యవేక్షణలో ఈ క్లిష్టమైన వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసామన్నారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకుంటూ సాధారణ జీవనశైలిలోకి అడుగుపెడుతున్నారని, మూడు నెలల తరువాత కూడా రోగి ఆరోగ్యం స్థిరంగా ఉందన్నారు. “సికిల్ సెల్ వ్యాధి రక్తంలోని హీమోగ్లోబిన్‌లో జరిగే జన్యుపరమైన మార్పుల వల్ల ఏర్పడే తీవ్రమైన రక్త సంబంధిత వ్యాధి. దీని వల్ల రక్తకణాలు ఆకారంలో మార్పు చెంది, శరీరంలో తగినంత ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుందని, దీర్ఘకాలంలో అవయవ నష్టం, జ్వరం, ఎముకలు నొప్పులు వంటి తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్టెమ్ సెల్ లేదా బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అత్యంత ప్రభావవంతమైన, శాశ్వత పరిష్కారమని, సరైన సమయంలో చికిత్స చేయడం ద్వారా రోగులు పూర్తిగా కోలుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. విజయవంతమైన వైద్య ప్రక్రియ యశోదా హాస్పిటల్స్‌లో లభ్యమయ్యే ఆధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, సాంకేతిక సిబ్బంది, రోగి సంరక్షణలో ఉన్న నిబద్ధత వలన సాధ్యమైందని, ఇటువంటి విజయాలు రోగులకు కొత్త జీవం, కుటుంబాలకు కొత్త ఆశ అందిస్తున్నాయన్నారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ కె.కరుణ కుమార్ తో పాటు ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
అక్టోబర్ 24, శుక్రవారం 2025


# వరుసగా రెండు డకౌట్‌లు..

## ఆటకు విరాట్ గుడ్‌బై చెబుతాడా?

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మరోసారి నిరాశ పరిచాడు. కనీసం పరుగుల ఖాతా కూడా తెరలేకపోవడం గమనార్హం. దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన విరాట్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. కానీ, వాటిని అందుకోవడంలో విఫలమయ్యాడు. ఆసీస్‌తో పెర్త్ వన్డేలో 8 బంతులు ఆడిన కోహ్లీ పరుగుల ఖాతా తెరవలేదు. ఇప్పుడు తనకు కలిసొచ్చే అడిలైడ్‌లోనూ ఇబ్బంది పడ్డాడు. ఈసారి నాలుగు బంతుల్లోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో భారత అభిమానులు తీవ్రస్థాయిలో నిరుత్సాహానికి గురయ్యారు. అయితే, కోహ్లీ తన వన్డే కెరీర్‌లో ఇలా వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్ కావడం ఇదే తొలిసారి. ఇప్పుడు ఆ చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు.



### ఈ సిరీస్‌లో ఔట్ అయ్యిందిలా..

పెర్త్ వేదికగా భారత్ - ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరిగింది. వర్షం పలుమార్లు అంతరాయం కలిగించినా చివరికి ఆసీస్‌నే విజయం వరించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ ఆఫ్‌సైడ్ బంతిని కదిలించి వికెట్ ఇచ్చాడు. మిచెల్ స్టార్క్ సంధించిన బంతిని ఆడబోయి బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఫీల్డర్‌కు చిక్కాడు. ఇప్పుడు అడిలైడ్‌లోనూ రాణిస్తాడనుకుంటే ఇక్కడా బ్యాట్ ఎత్తేశాడు. ఈసారి బార్ట్‌లెట్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. కనీసం డీఆర్ఎస్ కూడా తీసుకోకపోవడం గమనార్హం. పెవిలియన్‌కు వెళ్తూ అభిమానులకు అభివాదం చేయడంతో కొత్త చర్చ మొదలైంది. ఈ సిరీస్ అనంతరం వన్డేలకూ వీడ్కోలు చెబుతాడా? అనే సందేహం అభిమానుల్లో నెలకొంది. ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది.

# పేసర్‌కు స్పిన్నర్‌కు తేడా తెలియదా?

## శశిథరూర్‌పై నెటిజన్లు ఫైర్!

భారత సెలక్షన్ కమిటీని ఇరకాటంలో పెడదామని భావించిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు చుక్కెదురైంది. సోషల్ మీడియాలో తాను పెట్టిన పోస్టుకు విమర్శల తాకిడి ఎక్కువైంది. అసలు ఆయన ఏం పోస్టు పెట్టారు?ఎందుకు ఇలాంటి పరిస్థితి వచ్చిందో చూద్దాం.

### భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్ లైవ్ అప్‌డేట్స్

ఆస్ట్రేలియాతో భారత్ రెండో వన్డేను అడిలైడ్ వేదికగా ఆడుతోంది. టాస్ ఓడిన టీమ్‌ఇండియా తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. అయితే, తుది జట్టులో గత మ్యాచ్‌కు, ఇప్పటికీ ఏమార్పు లేకుండా బరిలోకి దిగింది. కుల్‌దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని బయట నుంచి డిమాండ్లు వచ్చినా మేనేజ్‌మెంట్ మాత్రం ఎలాంటి మార్పు లేకుండానే ఆడించింది. దీంతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. "కేవలం నాలుగు బంతుల్లోనే



ఆసీస్ బౌలర్ జేవియర్ బార్ట్‌లెట్ భారత సెలక్షన్ నిర్ణయం ఎంత తెలివి తక్కువైందో నిరూపించాడు. జర్నీ మ్యాన్ హర్షిత్ రాణా కోసం మ్యాచ్ విన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను పక్కనపెట్టడం సరైంది కాదు. ఇంగ్లాండ్ పర్యటనలోనూ ఇలాగే చేశారు. ఇప్పుడు ఆసీస్‌తో వన్డే సిరీస్‌లోనూ తుది జట్టులో ఆడించడం లేదు. ఇది అసంబద్ధం. దారుణం" అని శశిథరూర్ పోస్టు పెట్టారు. ఇప్పుడు ఇదే నెట్టింట వైరల్‌గా మారిపోయింది.

### బ్యాటింగ్‌లో రాణించాడు..

ఫాస్ట్ బౌలర్‌కు, స్పిన్నర్‌కు తేడా తెలియకుండానే ఆట గురించి కొందరు పోస్టులు పెట్టేస్తారంటూ అభిమానులు కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. హర్షిత్ రాణా తుది జట్టులో ఎందుకు అనే ప్రశ్నకు ఇవాళ అతడు బ్యాటింగ్‌తో సమాధానం ఇచ్చాడు. ఆఖర్లో దూకుడుగా ఆడి 24 పరుగులు రాబట్టాడు. అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి టీమ్‌ఇండియాకు విలువైన భాగస్వామ్యం అందించాడు. దానిని గుర్తుచేస్తూ నెటిజన్ల కామెంట్లు ఇలా..

"జేవియర్ బార్ట్‌లెట్ పేసర్. కుల్‌దీప్ యాదవ్ చైనామన్ స్పిన్నర్. మీరు మాత్రం భారత సెలక్షన్ కమిటీని విమర్శించే తొందరలో అది మరిచిపోయినట్లు ఉన్నారు"

"ఆస్ట్రేలియా కూడా నలుగురు పేసర్లతో బరిలోకి దిగింది. భారత్ అదే చేసింది. జేవియర్ బార్ట్‌లెట్ స్పిన్నర్ కాదు. ఇప్పటికే జట్టులో అక్షర్ పటేల్‌తోపాటు వాషింగ్టన్ సుందర్ ఉన్నాడు. వీరిద్దరూ బ్యాటింగ్ కూడా చేస్తారనే మేనేజ్‌మెంట్ తీసుకుంది"

"జేవియర్ బార్ట్‌లెట్ కాదు. మీరు జేవియర్ దోహర్తి గురించి ఇలా పోస్టు పెట్టారనుకుంటా. హర్షిత్ రాణా బ్యాటింగ్‌లోనూ కొన్ని పరుగులు రాబట్టాడు. ఆసీస్ మాదిరిగానే నలుగురు పేసర్లను భారత్ బరిలోకి దింపింది"

# సెంచరీలతో కదంతొక్కిన భారత ఓపెనర్లు స్మృతి, ప్రతీక...

- కివీస్ ముందు కొండంత లక్ష్యం
- మహిళల ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో భారత్ ఢీ
- టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా
- తొలి వికెట్‌కు 212 పరుగుల రికార్డు భాగస్వామ్యం
- చివర్లో మెరిసిన జెమీమా రోడ్రిగ్స్.. మెరుపు అర్ధశతకం
- వర్షం కారణంగా 49 ఓవర్లకు కుదింపు..
- భారత్ భారీ స్కోరు... 49 ఓవర్లలో 3 వికెట్లకు 340 పరుగులు

ఐసీసీ మహిళల ప్రపంచకప్‌లో భారత జట్టు బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. న్యూజిలాండ్‌తో గురువారం జరుగుతున్న కీలక మ్యాచ్‌లో ఓపెనర్లు స్మృతి మంధన (109), ప్రతిక రావల్ (122) అద్భుతమైన సెంచరీలతో కదం తొక్కారు. వీరిద్దరి శతకాలకు జెమీమా రోడ్రిగ్స్ (76లి) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో, టీమిండియా 49 ఓవర్లలో 3 వికెట్లకు 340 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. నవీ ముంబైలోని



డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధన, ప్రతిక రావల్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ పరుగుల వరద పారించారు. ఈ క్రమంలో ఇద్దరూ తమ సెంచరీలను పూర్తి చేసుకున్నారు. తొలి వికెట్‌కు ఏకంగా 212 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. స్మృతి మంధన కేవలం 95 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో దూకుడుగా ఆడగా, ప్రతిక రావల్ నిలకడగా రాణించి 122 పరుగులు చేసింది. వన్ డౌన్ లో వచ్చిన జెమీమా రోడ్రిగ్స్ తనదైన శైలిలో మెరుపులు మెరిపించింది. కేవలం 55 బంతుల్లోనే 11 ఫోర్ల సహాయంతో అజేయంగా 76 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (10) త్వరగా ఔటైనా, జెమీమా దూకుడు కొనసాగించింది. భారత బ్యాటర్ల విజృంభణతో టీమిండియా భారీ స్కోరు దిశగా సాగింది. అయితే, ఇన్నింగ్స్ చివర్లో వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. దీంతో భారత జట్టు 49 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 340 పరుగుల భారీ స్కోరు సాధించి న్యూజిలాండ్‌కు కొండంత లక్ష్యాన్ని నిర్దేశించింది.

# ప్రిక్వార్టర్స్‌లో ఉన్నతి

### సాత్విక్ జోడీ ఓటమి ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్

**సెసొన్-సెవిన్యే (ఫ్రాన్స్):** ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత యువ షట్లర్ ఉన్నతి హుడా ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 11-21, 21-13, 21-16తో మలేసియాకు చెందిన లెత్సానా కరుపతెవన్‌పై విజయం సాధించింది. అనుపమ 15-21, 11-21తో హాన్ యూ (చైనా) చేతిలో, అన్మోల్ ఖరబ్ 15-21, 9-21తో అన్ సి యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో కంగుతిన్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి తొలి రౌండ్ దాటలేకపోయాడు. హెూరాహెూరీ పోరులో అతడు 19-21, 19-21తో జపాన్ షట్లర్ కొకి వతనబె చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జంట నిరాశపరిచింది. మొదటి రౌండ్లో ఈ జోడీ 18-21, 20-22తో ఇండోనేసియా జంట హిదాయత్, రియాన్ అర్డియాంటోల చేతిలో పరాజయంపాలైంది.



## రెండో వన్డేలోనూ

# టీమిండియా ఓటమి..

# సిరీస్ ఆస్ట్రేలియా కైవసం

**రెండో వన్డేలో టీమిండియాపై రెండు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు**
**మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న కంగారూలు**
**రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ అర్ధశతకాలు వృథా**
**ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన మాథ్యూ షార్ట్, కనోలీ**
**బంతితో చెలరేగిన ఆడమ్ జంపా.. 4 వికెట్లతో భారత్ పతనం**
**265 పరుగుల లక్ష్యాన్ని 8 వికెట్లు కోల్పోయి ఛేదించిన ఆస్ట్రేలియా**



ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు నిరాశ ఎదురైంది. అడిలైడ్ ఓవల్ వేదికగా గురువారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 2 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఈ విజయంతో, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. భారత బౌలర్లు చివరి వరకు పోరాడినప్పటికీ, కీలక సమయంలో ఆసీస్ బ్యాటర్లు రాణించడంతో ఫలితం ప్రతికూలంగా వచ్చింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా, భారత జట్టును నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 264 పరుగులకే పరిమితం చేసింది. భారత ఇన్నింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (9), విరాట్ కోహ్లీ (0) త్వరగా ఔటవ్వడంతో 17 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రోహిత్ శర్మ (97 బంతుల్లో 73), శ్రేయస్ అయ్యర్ (77 బంతుల్లో 61) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌లతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత అక్షర్ పటేల్ (41 బంతుల్లో 44) వేగంగా ఆడటంతో భారత్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా 4 వికెట్లతో చెలరేగగా, జేవియర్ బార్ట్‌లెట్ 3, మిచెల్ స్టార్క్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 265 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 46.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఛేదనలో ఆసీస్‌కు కూడా శుభారంభం దక్కలేదు. అయితే, మాథ్యూ షార్ట్ (78 బంతుల్లో 74 పరుగులు) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు బాటలో నడిపించాడు. మధ్యలో వికెట్లు పడుతున్నా, యువ ఆటగాడు కూపర్ కనోలీ (53 బంతుల్లో 61 రన్స్ నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. అతనికి మిచెల్ ఓవెన్ (23 బంతుల్లో 36 రన్స్) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో ఆసీస్ విజయం సులభమైంది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ తలో రెండు వికెట్లు తీశారు. సిరాజ్, అక్షర్ పటేల్‌కు చెరొక వికెట్ దక్కింది. ఈ విజయంతో సిరీస్‌ను ఆసీస్ సొంతం చేసుకోగా, చివరి మ్యాచ్ నామమాత్రంగా మిగిలింది. ఇరుజట్ల మధ్య మూడో వన్డే అక్టోబరు 25న సిడ్నీలో జరగనుంది.

# గిల్‌తో కరచాలనం.. వక్రబుద్ధిని చాటుకున్న పాక్ అభిమాని..



టీమ్‌ఇండియా ప్రస్తుతం అడిలైడ్‌లో ఉంది. ఆస్ట్రేలియాతో రెండో వన్డే సందర్భంగా అక్కడ పర్యటిస్తోంది. ఈ క్రమంలో ఆప్షనల్ ట్రైనింగ్ సెషన్ కావడంతో ఆటగాళ్లలో కొందరు అడిలైడ్ చూసేందుకు వెళ్లారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా హర్షిత్ రాణాతో కలిసి బయటకు వెళ్లాడు. ఈ సందర్భంగా ఓ క్రికెట్ అభిమానితో కరచాలనం చేశాడు. అయితే, సదరు ఫ్యాన్ పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఎందుకంటే, గిల్‌తో కరచాలనం అనంతరం ఆ వ్యక్తి 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినదించాడు. ఇప్పుడు అదే తీవ్ర చర్చకు దారితీసింది. సదరు ఫ్యాన్ చేసిన దానిపై నెట్టింట విమర్శలు వస్తున్నాయి. కానీ, టీమ్‌ఇండియా సారథి గిల్ మాత్రం ఎలాంటి స్పందన లేకుండా ముందుకుసాగిపోయాడు. దీంతో శుభమన్‌పై ప్రశంసల వర్షం కురుస్తుండగా.. పాక్ అభిమానిపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఆసియా కప్ సందర్భంగా పాక్ ఆటగాళ్లతో కనీసం మన క్రికెటర్లు కరచాలనం కూడా చేయలేదు. విజేతగా నిలిచినా సరే మోసిన్ నక్వీ నుంచి టైటిల్‌ను అందుకోలేదు. కానీ, ఇప్పుడు ఆ అభిమాని ఎవరనేది చూడకుండా గిల్ హుందాగా కరచాలనం చేశాడు. కానీ, అతడు మాత్రం వక్రబుద్ధిని ప్రదర్శించాడని భారత క్రికెట్ అభిమానులు విరుచుకుపడ్డారు. ఇది ఆ దేశం సాధించిన అతిపెద్ద అచీవ్‌మెంట్‌గా ఎద్దేవా చేస్తూ కామెంట్లు చేశారు.

https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక



## ధగధగా మెరిసిపోతున్న రకుల్..

# వ్హావ్టే లుక్!

టాలీవుడ్, బాలీవుడ్?లలో స్టార్ హీరోయిన్?గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకుంది రకుల్ ప్రీత్ సింగ్. నటనతోనే కాకుండా, తన ఫ్యాషన్ సెన్స్, ఫిట్?నెస్?తో ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండింగ్?లో ఉంటుంది. తాజాగా ఓ అవార్డుల వేడుకలో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రముఖ మ్యాగజైన్ నిర్వహించిన ఈవెంట్?లో రకుల్ స్టైలిష్ లుక్?లో ధగధగా మెరిసిపోయింది. సిల్వర్ క్రిస్టల్ వర్క్ ఉన్న బ్లాక్ కలర్ డిజైనర్ డ్రెస్?లో ఎంతో గ్లామరస్?గా కనిపించింది. స్లీక్ హెయిర్?స్టైల్, మినిమల్ యాక్సెసరీస్?తో తన లుక్?ను హైలెట్ చేసింది. ఈ వేడుకలో ఆమె "ఎల్లే ప్యూర్ ప్రజెన్స్" అవార్డును కూడా అందుకుంది. కెరీర్ ప్రారంభంలో టాలీవుడ్?లో వరుస విజయాలతో టాప్ హీరోయిన్?గా ఎదిగింది రకుల్. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత బాలీవుడ్?పై ఫోకస్ పెట్టి, అక్కడ కూడా సక్సెస్?ఫుల్ హీరోయిన్?గా నిలదొక్కుకుంది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ దక్షిణాది, ఉత్తరాది భాషల్లో పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కమల్ హాసన్ నటిస్తున్న ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ 'ఇండియన్ 3'లో కీలక పాత్ర పోషిస్తోంది. దీంతో పాటు మరికొన్ని హిందీ సినిమాలకు కూడా సైన్ చేసింది. ఒకవైపు సినిమాలు, మరోవైపు బిజినెస్?లతో రకుల్ తన కెరీర్?ను పక్కాగా ప్లాన్ చేసుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూనే, గ్లామర్?లోనూ ఏమాత్రం తగ్గకుండా ఫ్యాన్స్?ను అలరిస్తూ కెరీర్?లో ముందుకు సాగుతోంది. అలాగే హిందీలో హిట్టయిన దేదే ప్యార్ దే సీక్వెల్ తో పాటు పతి పత్నీ ఔర్ వో పార్ట్ 2లో కూడా నటిస్తోంది. సక్సెస్ రేటు గతంలో కంటే కాస్త తగ్గినా కూడా మార్కెట్ లో తన క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇక రాబోయే సినిమాలు అమ్మడికి ఎలాంటి ఫలితాన్ని అందిస్తాయో చూడాలి.

# ఘనంగా ఉపాసన సీమంతం వేడుక

- హాజరైన మెగా, కామినేని కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు
- వేడుకలో పవన్ కల్యాణ్ అర్ధాంగి అన్నా లెజినోవా ప్రత్యేక ఆకర్షణ
- వేడుకకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన కొణిదెల దంపతుల ఇంట మరోసారి సంతోషం వెల్లివిరిసింది. ఉపాసన రెండోసారి గర్భం దాల్చినట్లు తెలుస్తోంది. ఈ శుభవార్తను ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో మెగా అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. ఇటీవల దీపావళి పండుగ సందర్భంగా తన నివాసంలో జరిగిన వేడుకలకు సంబంధించిన ఒక వీడియోను ఉపాసన పంచుకున్నారు. ఆ వీడియో ద్వారా తాను గర్భవతిననే విషయాన్ని ఆమె సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ వార్త బయటకు వచ్చిన కొన్ని రోజులకే, ఆమె కోసం కుటుంబ సభ్యులు సీమంతం వేడుకను ఘనంగా నిర్వహించినట్లు సమాచారం. ఈ కార్యక్రమం అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగినట్టు తెలుస్తోంది. ఈ వేడుకకు మెగా కుటుంబ సభ్యులతో పాటు ఉపాసన తల్లిదండ్రులు, కామినేని కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అర్ధాంగి అన్నా లెజినోవాతో పాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపాసన దంపతులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ సీమంతం వేడుకకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇది చూసిన అభిమానులు, నెటిజన్లు రామ్ చరణ్, ఉపాసన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.











# మన శంకర వరప్రసాద్..'లోకి వెంకటేష్




చిరంజీవి హీరోగా వస్తోన్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర షుటింగులో తాజాగా వెంకటేష్ భాగమయ్యారు. ఆయనకు వెల్‌కమ్ చెబుతూ చిరంజీవి ఓ ప్రత్యేక వీడియో పంచుకున్నారు. అందులో వెంకటేశ్‌ను చిరంజీవి 'మై బ్రదర్' అని పిలవగా.. 'చిరు సర్.. మై బాస్' అంటూ చిరుని వెంకటేష్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సుష్మిత కొణిదెల, సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు. నయనతార హీరోయిన్‌గా చేస్తున్నారు.

# సంగీత దర్శకుడు సబేష్ కన్నుమూత

ఎన్నో సూపర్ హిట్ చిత్రాలకు సంగీతాన్ని అందించిన ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు సబేష్ గురువారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మృతికి కోలీవుడ్ చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి వ్యక్తం చేసింది. సబేష్‌కు సంగీత దర్శకుడు దేవా సొంత సోదరుడు. వీరిద్దరి కాంబినేషన్‌లో ఎన్నో చిత్రాలకు సంగీతాన్ని అందించారు. సబేష్ గాయకుడిగానూ రాణించారు. వీరి మరో సోదరుడు మురళి సైతం సంగీత దర్శకుడు. సబేష్, మురళి జంట సంగీత దర్శకులుగా పేరుగాంచారు. వీరిద్దరు సినిమాలనే కాకుండా ఎన్నో పేరొందిన ప్రైవేట్ ఆల్బమ్‌లను రూపొందించారు. సబేష్ కుమారుడు కార్తీక్ ప్రస్తుతం హాస్యనటుడిగా తమిళ సినీ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు.




# కొత్త సినిమా 'ఫౌజీ'




సినీ కథానాయకుడు ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. సోషల్ మీడియా వేదికగా సందేశాలు ప్రకటిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఒక స్పెషల్ వీడియోను షేర్ చేసింది. సుమారు 7నిమిషాల పాటు ఉన్న ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. గతంలో ప్రభాస్ గురించి రచయిత విజయేంద్ర ప్రసాద్ చెప్పిన 'అర్జునుడి లాంటి రూపం.. శివుడి లాంటి బలం.. రాముడి లాంటి గుణం..' డైలాగ్స్‌తో వీడియోతో ప్రారంభమౌతుంది. ఆయన నటించిన సినిమాల్లోని కొన్ని పాపులర్ సీన్స్‌తో ఈ వీడియోను ఎడిట్ చేశారు. హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజీ' సినిమా తెరకెక్కనుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయన పోస్టు పెట్టారు. 'పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడు.. పాండవుల పక్షాన ఉన్న కర్ణుడు.. గురువు లేని ఏకలవ్యుడు.. పుట్టకతోనే అతడు ఓ యోధుడు.. మన చరిత్రలో దాగిన అధ్యాయాల్లోని అత్యంత ధైర్యవంతుడైన సైనికుడి కథ ఇది. అతడే 'ఫౌజీ'' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. ప్రభాస్‌కు జంటగా ఇమాన్వీ నటిస్తున్నారు. 'మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకూ ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. 'సీతారామం' తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు' అంటూ హను రాఘవపూడి ఈ చిత్రం గురించి గతంలోనే ప్రస్తావించిన విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతోంది.

# 25న 'ది గర్ల్‌ఫ్రెండ్' ట్రైలర్ విడుదల



కథానాయకుడుగా దీక్షిత్‌శెట్టి, కథానాయికగా రశ్మిక మందన్నా జోడీగా నటించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమా ట్రైలర్‌ను ఈనెల 25న విడుదల చేయబోతున్నట్లుగా చిత్ర యూనిట్ గురువారం ప్రకటించింది. నవంబర్ ఏడోతేదీన పాన్ ఇండియా ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రాహుల్ రవీంద్రన్ దర్శకుడుగానూ, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు.

# పోలీసు పాత్రలో



ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమంటే'. 'థ్రిల్ ప్రాప్తిరస్తు' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ చిత్రాన్ని సునీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. లవ్, కామెడీ, థ్రిల్లింగ్ అంశాలతో రాబోతున్న ఈ చిత్రం నుండి తాజాగా సుమ కనకాల పాత్రని పరిచయం చేశారు. 'సాధారణ పోలీసు కాదు.. నవ్వడానికి సిద్ధంగా ఉండండి.. ఫైనల్‌గా సుమ కామెడీ టైమింగ్‌ని బిగ్ స్క్రీన్‌పై చూడబోతున్నాం' అంటూ సోషల్‌మీడియాలో ఈ కొత్త పోస్టర్‌ని రిలీజ్‌చేశారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339